


సోమశిలలో 50.550 టీఎంసీల నీరు



అనంతసాగరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 28,161 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. దీంతో డ్యాంలో 50.550 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు 1,850, ఉత్తర కాలువకు 330, వరద కాలువకు 8,600 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

బోగస్ పింఛన్ల
లెక్క తేలింది!

జిల్లాలో దొంగ పింఛన్ల లెక్క తేలింది. అన్నీ అవయవాలు బాగున్న సకలాంగులు కూడా తాము దివ్యాంగులమంటూ నెల నెలా ప్రభుత్వం నుంచి పింఛను పొందుతున్నట్లు తేటతెల్లమైంది. వైసీపీ పాలనలో అక్రమాలతో ఒకరు... ఇద్దరు కాదు 5065 మంది అనర్హులు ఇన్నాళ్లు పింఛను పొందినట్లు నిర్ధారణ అయింది. వీటన్నింటినీ రద్దు చేయడంతో ప్రభుత్వానికి నెలకు రూ 3.03 కోట్లు మిగిలింది. ఇవికాక తీవ్ర అనారోగ్యం లేకపోయినా ఆ కోటాలో కొందరు పింఛను పొందుతున్నట్లు గుర్తించి వాటిని దివ్యాంగ పింఛన్లుగా మార్చారు. తద్వారానూ ప్రభుత్వ ఖజానాకు మరికొంత ఆదా కానుంది.

- సకలాంగులకూ సదరం ధ్రువపత్రాలు
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- అధికారుల పరిశీలనలో బహిర్గతం
- 5,065 పింఛన్ల రద్దు
- ప్రభుత్వానికి నెలకు రూ.3.03కోట్ల ఆదా
- అనారోగ్య పెన్షన్లు 597కి కుదింపు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్య, వితంతు వంటి సామాజిక పింఛన్లతోపాటు దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి ప్రభుత్వం ప్రతీ నెలా పింఛను ఇస్తోంది. అయితే వైసీపీ పాలనలో ఇవి దుర్వినియోగమ య్యాయి. అప్పట్లో సదరం ధ్రువపత్రాల జారీలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు స్పష్టమైంది. కాలు వంకర, చేయి వంకర అని, చెవులు విని పించటం లేదని, కళ్లు సరిగా కనిపించటం లేదని, మానసిక వైకల్యమంటూ చాలా మంది సకలాంగులు సదరం ధ్రువపత్రాలు పొందినట్లు నిర్ధారణ అయింది. ఇలాంటి వాటి వడపోతకు కొన్ని నెలల క్రితం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులతో సదరం పత్రాల పునఃపరిశీలన కార్యక్రమం చేపట్టింది.

● అనర్హులు 5065 మంది

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికల హామీలో భాగంగా పింఛన్ల మొత్తాన్ని భారీగా పెంచింది. దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, అనారోగ్యంతో బాధపడేవారికి వారి పరిస్థితికి తగ్గట్టు రూ.5వేలు, రూ10వేలు, రూ. 15వేలు చొప్పున పింఛను అందిస్తోంది. ఇదే సమయంలో అనర్హులు కూడా పెద్ద సంఖ్యలో పింఛన్లు పొందుతూ రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్నట్లు గుర్తించింది. ఈ క్రమంలో వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో 32,205 మంది దివ్యాంగ పింఛన్లు పొందుతుండగా వారిలో 4215 మంది వైకల్యం లేకపోయినా పింఛను పొందుతున్నట్లు తేలింది. మరో 850 మంది దివ్యాంగుల వివరాలు తెలియలేదని అధికారుల సమాచారం. మొత్తంగా ఈ 5065 మంది అనర్హులు ప్రతీ నెల రూ.6వేల చొప్పున దివ్యాంగ పింఛను పొందుతున్నట్లు గుర్తించారు. వాటిని రద్దు చేయడంతో ప్రభుత్వానికి రూ.3.03కోట్లు ఆదా అయింది.



● అనారోగ్య పింఛన్ల కుదింపు

జిల్లాలో రూ.5వేలు, రూ10వేలు, రూ. 15వేలు తీసుకుంటున్న ఆరోగ్య పింఛనర్లు 1907 మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ. 2.41కోట్లు చెల్లిస్తున్నారు. వారందరినీ విచారించి 597 మంది పింఛన్లను దివ్యాంగ పింఛన్లుగా మార్పు చేశారు.



అప్పీలు చేసుకోవచ్చు

ఏదైనా కారణాలతో అర్హులైన లబ్ధిదారులు అనర్హులుగా జాబితాలో వచ్చినట్లయితే వారు స్థానిక వెల్ఫేర్ సిబ్బందిని సంప్రదించాలి. నివేదిక తీసుకున్న 90 రోజుల్లోగా మళ్లీ సదరం పత్రానికి ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అప్పీలు చేసుకోవచ్చు.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్

కడలిపుత్రుల్లో
కల్లోలం

గంగపుత్రులకు కడలి కన్నతల్లిలాంటిది. అందులో దొరికే మత్స్య సంపదను వేటాడి జీవనోపాధి పొందుతారు. అయితే, ఈ సంపదను పొరుగు రాష్ట్రమైన తమిళ మత్స్యకారులు కొల్లగొడుతున్నారు. మెటనైజ్డ్ హెవీ మోటరు వంటి బోట్ల సహాయంతో వేటాడి దోచుకోవడమేగాక అడ్డొచ్చిన మనవారిపైనా దాడులకు పూనుకుంటున్నారు. వారి ఆగడాలకు చెక్ పెట్టాలని ఇటు పాలకులు, అటు అధికార యంత్రాంగాన్ని మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇక చేసేదిలేక తమిళ మత్స్యకారులకు చెక్‌పెట్టేందుకు ఏపీలోని నాలుగు జిల్లాల్లో మత్స్యకార కాపులు, పెద్దలు ఏకమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం లేదా తమిళ మత్స్యకారులను కడలిలోనే ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నారు.

- ఏపీలోకి చొరబడుతున్న తమిళ మత్స్యకారులు
- మెటనైజ్డ్ బోట్లతో మత్స్యసంపద దోపిడీ
- అడ్డుకున్న మనవారిపైనా దాడులు
- ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా చర్యలు శూన్యం
- ఏకమైన 4 జిల్లాల మత్స్యకార కాపులు
- పొరుగు జాలర్లను ఎదుర్కొనేందుకు తీర్మానం



జువ్వలదిన్నె ఫిషింగ్ హర్బర్‌లో ఉన్న కడలూరు బోటు

బిట్రగుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : 2010 సంవత్సరం ముందు తమిళనాడులోని కడలూరు, కారైకల్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు రామేశ్వరం మీదుగా శ్రీలంక సముద్ర తీరంలో చేపలవేట సాగిస్తుండేవారు. అక్రమంగా మత్స్యసంపదను దోచుకుపోతున్న వారిపై శ్రీలంక తీరప్రాంత వాసులు తిరగబడి దాడులు చేయడం ప్రారంభించారు. ఇక తమ ఆటలు సాగవని 2010లో తమిళ మత్స్యకారులు ఏపీలోకి అడుగుపెట్టారు. ఇక్కడ సమృద్ధిగా మత్స్య సంపద దొరకడంతో తిరుపతి, నెల్లూరు జిల్లాల తీరంలో జోరుగా వేట కొనసాగించారు. ఇందుకు ప్రధాన కారణం రూ.1.2 కోట్ల నుంచి 4 కోట్ల విలువైన మెటనైజ్డ్ బోట్లు తమిళ జాలర్ల వద్ద ఉండటమే. మత్స్యసంపదను దోచుకుపోతున్న తమిళులను ఎదుర్కొనేందుకు ప్రయత్నించిన ఏపీ మత్స్యకారులపై వారు దాడికి దిగారు. వారిని ఎదుర్కోలేక బతుకు జీవనం కోసం గంగపుత్రులు కాకినాడ, మచిలీపట్నం ప్రాంతాల తోపాటు కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వలస వెళ్లారు.

బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో సమావేశమైన 4 జిల్లాల మత్స్యకారులు (ఫైల్)



● తమిళ మత్స్యకారుల దాడులు

ఆంధ్ర తీర ప్రాంత మత్స్యకారుల వద్ద మెటనైజ్డ్ బోట్లను ఎదుర్కొనే శక్తి లేదని తెలుసుకున్న కడలూరు, కరైకల్, నాగపట్నం ప్రాంతాల మత్స్యకారులు ఏపీ తీరంలోకి చొరబడ్డారు. ఒకటీ రెండు బోట్లు కాకుండా ఏకంగా 10 నుంచి 15 బోట్లలో ఏక కాలంలో మన తీరంలోకి చొరబడ్డారు. తమిళ బోట్ల ఆగడాలను చూసిన అల్లూరు మండలం ఇస్కపల్లి మత్స్యకారులు 2023, ఏప్రిల్‌లో కట్టడి చేసేందుకు ఉపక్రమించారు. ఫైబర్ బోట్లతో వెళ్లిన మనవారిపై రాళ్ళు, గాజుసీసాలతో తమిళ మత్స్యకారులు దాడులు చేశారు. దాదాపు తీరం దాక వచ్చి దాడిచేస్తున్నా మెరైన్ పోలీసులు సైతం ఏం చేయలేని పరిస్థితి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కడలిపుత్రుల్లో కదలిక మొదలై 2023లోనే తీరప్రాంత నాలుగు జిల్లాల మత్స్యకారులు సమావేశమయ్యారు. కడలూరు, కారైకల్ హెవీబోట్లను ఎదుర్కోవాలంటే అంతటి సామర్థ్యం ఉండే బోటును కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. దాని విలువ కోటి రూపాయల పైచిలుకు కావడంతో 164 గ్రామాల మత్స్యకారులు చందాలు వేసుకునేందుకు పూనుకున్నారు. ఇది మత్స్యకారులకు ఆర్థిక భారంగా మారింది. మెటనైజ్డ్ బోటును ఎదుర్కొనే సామర్థ్యం కలిగిన బోటు కొనుగోలుకు రాయితీ ఇప్పించాలని 2024, జనవరి 1వ తేదీన జువ్వలదిన్నెలో పర్యటించిన కేంద్ర మత్స్య, జంతు, పాడి పరిశ్రమల సంయుక్త మంత్రి పరుషోత్తమ రూపాల దృష్టికి మత్స్యకారులు తీసుకుపోయారు. ఇప్పటికీ అతీగతీ లేదు.

కూలిపనులకు వెళ్లాల్సిందే!



సముద్రంలో మత్స్యవేటే మాకు జీవనాధారం. అలాంటిది తమిళనాడుకు చెందిన మత్స్యకారులు చొరబడి సంపదను దోచుకెళుతున్నారు. తమిళ హైపర్‌బోట్లను ఆంధ్రాలోకి రావడాన్ని అడ్డుకోలేకపోతే మాకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. సముద్రంలో చేపలవేట మాని కూలి పనులకు వెళ్లాల్సిందే.

- సున్నపుగుంట గోవిందయ్య, ఇస్కపల్లి

● విరుచుకుపడిన కృష్ణాపురం గంగపుత్రులు

తమిళ మత్స్యకారులు తరచూ ఆంధ్ర తీరంలోకి చొరబడి చేపల వేట సాగించడమే కాకుండా ఫైబర్ బోట్లపై దాడి చేయడం, వలలను ధ్వంసం చేయడాలు పెరిగిపోయాయి. ఈ విషయాన్ని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోవడంతో విసిగివేశారిన కృష్ణాపురం మత్స్యకారులు గత నెల 31వ తేదీన కడలూరు బోటును అడ్డగించారు. తీరప్రాంతాల గంగపుత్రులు సమావేశమై పట్టుకున్న హెవీబోటును జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాంగణానికి చేర్చాలని నిర్ణయించుకున్నారు. అదుపులో ఉన్న మెటనైజ్డ్ బోటు విషయమై నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన 160 గ్రామాలకు చెందిన మత్స్యకార గ్రామ కాపులు, పెద్దలతో ఈ నెల 6వ తేదీన బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో సమావేశమయ్యారు. కడలూరు, కారైకల్ హెవీబోట్లను కలిసి కట్టుగా కట్టడి చేసేందుకు మత్స్యకారులు ఏకమయ్యారు.

● పట్టించుకోని ప్రభుత్వాలు

సంవత్సరాల తరబడి తమిళ మత్స్యకారులు ఏపీలోకి చొరబడి మత్స్యసంపద దోచుకుపోతున్నారని మొత్తుకుంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని గంగపుత్రులు ఆవేదన చెందుతున్నారు. పాలకులను నమ్ముకోవడం వృథా ప్రయాస అని భావించిన 4 జిల్లాల మత్స్యకార కాపులు, గ్రామపెద్దలు నిర్ణయించుకున్నారు.

విజయోత్సాహం



వెంకటాచలంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ విజయోత్సవ ర్యాలీ మంగళవారం ఉత్సాహంగా సాగింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలం ఇసుక డంపింగ్ యార్డు నుంచి ఎర్రగుంట వరకు సుమారు 900లకుపైగా ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేపట్టారు.

- వివరాలు 8లో..

సూర్య, చంద్రప్రభలపై
వెంకయ్యస్వామి వైభోగం



సూర్యప్రభవాహనంపై కొలువుదీరిన వెంకయ్య స్వామి

వెంకటాచలం, ఆగస్టు 19 : గొలగమూడిలో జరుగుతున్న వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై దర్శనమించారు. వేకువజాము నుంచే స్వామివారికి వివిధ రకాల సేవలను చేసిన అర్చకులు ఉదయం 10 గంటల నుంచి సూర్యప్రభ వాహన సేవకు ఉత్సవమూర్తిని సిద్ధం చేశారు. ఆదిత్యుడిపై కొలువుదీరిన స్వామివారిని గొలగమూడి పుర వీధుల్లో ఊరేగించారు. రాత్రికి వెంకయ్య స్వామికి చంద్రప్రభ వాహన సేవ వైభవోపేతంగా జరిగింది. సన్నాయి వాయి ద్యాలు మోగుతుండగా భక్తులు ఓం నారాయణ, ఆదినారాయణ అంటూ భజనలు చేస్తుండగా స్వామివారు గ్రామంలో విహరించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

● ఉత్సవాల్లో నేడు

ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం వెంకయ్య స్వామికి హనుమంత, రాత్రి హంసవాహన సేవ జరుగుతుందని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.



చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

కావలి ఎమ్మెల్యే కుటుంబీకుల
క్వారీపై డ్రోన్ చక్కర్లు!

- ఇద్దరిని పట్టుకున్న సిబ్బంది, ఒకరు పరారీ !
- పట్టుకున్న వారిలో ఒకరు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి సహాయకుడు
- డ్రోన్, కత్తితో సహా పోలీసులకు అప్పగింత
- ఎమ్మెల్యేను హతమార్చేందుకే రెక్కీ అంటూ కూటమి నాయకుల ఆందోళన

జలదంకి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కుటుంబానికి చెందిన క్వారీపై మంగళవారం డ్రోన్ చక్కర్లు కొట్టడం కలకలం రేగింది. దానిని ఎగరేస్తున్న వారిలో ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిలో ఒకరు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి (వైసీపీ) అనుచరుడు కావడం గమనార్హం. జలదంకి మండలం అన్నవరంలో ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి కుటుంబానికి చెందిన ఓ క్వారీ ఉంది. మంగళవారం మధ్యాహ్నం క్వారీ పరిసరాల్లో డ్రోన్ ఎగురుతుండటం గమనించిన అక్కడి సిబ్బంది ముగ్గురు వ్యక్తులను పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారిలో ఒకరు పరారవగా, మరో ఇద్దరిని పట్టుకున్నారు. వీరిలో ఒకరు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు వేణు, మరో వ్యక్తి డ్రోన్ ఆపరేటర్ వినోద్‌గా గుర్తించి జలదంకి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. డ్రోన్ రిమోట్‌తోపాటు ఓ కత్తి కూడా ఉన్నట్లు గుర్తించిన క్వారీ సిబ్బంది వాటిని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. తప్పించుకుని పారిపోయిన వ్యక్తి శ్రావణ్‌గా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటనపై క్వారీ ఉద్యోగులు జలదంకి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా, ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డిని హత మార్చేందుకే ఆయన కదలికలపై డ్రోన్ ద్వారా రెక్కీ నిర్వహించారని, దీని వెనుక మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి హస్తం ఉందంటూ కూటమి శ్రేణులు ఆందోళన చేపట్టాయి. మంగళవారం పొద్దుపోయాక కావలి బ్రిడ్జి సెంటర్‌లలో నిరసన, అల్లూరు, బిట్రగుంట, దగదర్తిలలో నిరసన ర్యాలీ చేపట్టారు.

అంగన్‌వాడీల్లో ఆన్‌లైన్ ప్రక్రియకు బ్రేక్!

- సీడీపీవోలకు మొబైళ్ల అప్పగింత
- అవన్నీ వైసీపీ ప్రభుత్వం ఇచ్చినవే!
- త్వరలో 5జీ ఫోన్లు ఇస్తాం : పీడీ

ఉదయగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆన్‌లైన్ కార్యకలాపాలు బంద్ అయ్యాయి. మొబైల్ ఫోన్ పనితీరు సక్రమంగా లేకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఎదుట నిరసన చేపట్టి వాటిని సీడీపీవోలకు అప్పగించారు. పోషణ్ ట్రాకర్, బాలసంజీవని యాప్‌లలో ప్రతిరోజు వివిధ రకాల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే, వివరాల నమోదుకు ఫోన్ల వేగం సరిపోలేదంటూ కార్యకర్తలు గగ్గోలు పెట్టి, ఈ నెల 4వ తేదీన సీడీపీవోలకు వెనక్కి ఇచ్చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నాణ్యత లేని 2జీ నెట్‌వర్కు కలిగిన ఈ ఫోన్లను ఇవ్వడంతో అప్పట్లో అంగన్‌వాడీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పటికే జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో 4జీ, మరికొన్ని ప్రాంతాల్లో 5జీ నెట్‌వర్కు కొనసాగుతోంది. ఈ తరుణంలో ఫోన్లన్నీ మొరాయిస్తూ వచ్చాయి. అంగన్‌వాడీల రోజువారీ విధులకు ఆటంకం కలిగిస్తున్నాయి. మరోవైపు ఇంటింటా సరుకుల పంపిణీ (టీహెచ్‌ఆర్), పిల్లల హాజరు, బరువు, ఎత్తు కొలతల నమోదు తదితర ప్రక్రియ నిలిచిపోయింది.



మొబైళ్లు వద్దంటూ ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

● 80 శాతం మంది అప్పగింత

జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 229 మినీ, 2,705 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలోని సుమారు 80 శాతం మంది కార్యకర్తలు తమ సెల్‌ఫోన్లను సీడీపీవో కార్యాలయాల్లో అప్పగించారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల కార్యాకలాపాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. 5జీ ఫోన్లను సరఫరా చేస్తేనే యాప్‌లో వివరాలు నమోదుకు ఏ ఆటంకాలు ఉండవని అంగన్వాడీలు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జీ ఫోన్లను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కేంద్రాల నిర్వహణ రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం దుకాణాల్లో ఇక పర్మిట్ రూమ్‌లు

- ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- నగరంలో రూ.7 లక్షలు, రూరల్‌లో రూ.5 లక్షలు

నెల్లూరు (క్రైం) (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల పక్కనే మందుబాబులు మద్యం సేవించేందుకు వీలుగా శాశ్వత గదుల (పర్మిట్ రూమ్స్) ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 200 మద్యం దుకాణాలు పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు కానుండగా, నగర ప్రాంతాల్లో రూ.7 లక్షలు, రూరల్ ప్రాంతాల్లో రూ.5 లక్షలు చెల్లించాలని ఎక్సైజ్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

● ఇప్పటికే అనధికారికంగా..

మద్యం దుకాణాల్లో పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోకూడదని, మద్యం మాత్రమే అమ్మాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిబంధనలు తెచ్చింది. అయితే, ఇందుకు విరుద్ధంగా జిల్లావ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల్లో రూమ్‌లు ఏర్పాటు చేసి కుర్చీలు, టేబుళ్ల వంటి ప్రత్యేక ఏర్పాటు చేసి మందుబాబులతో మద్యం తాగిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పర్మిట్ రూమ్‌లను కేటాయించి, ప్రతి సంవత్సరం నగదు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

బిల్లులేవి సార్!?

- ఇరిగేషన్ శాఖలో నిలిచిన బిల్లుల చెల్లింపు
- ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు
- ఓఅండ్ఎం బిల్లులు అప్‌లోడ్ చేసేందుకూ లేని బడ్జెట్
- డీఆర్సీలోనూ ప్రస్తావించిన ఎమ్మెల్యేలు
- రానున్న సీజన్‌పై పడనున్న ప్రభావం



ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇరిగేషన్ శాఖలో ఓఅండ్ఎం పనులు వేగంగా చేయించారు.. కానీ ఇంత వరకూ ఒక్క రూపాయి బిల్లు విడుదల చేయలేదు. ఈ ఏడాది రెండో పంట సమయంలోనూ అదే మాదిరిగా నీటి సంఘాల చేత ఓఅండ్ఎం పనులు చేయించారు.. కానీ ఇప్పటికీ ఆ బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు బడ్జెట్ లేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రానున్న సీజన్ మాటేమిటి..? అప్పుడు ఓఅండ్ఎం పనులు ఎలా? అన్నది ఇప్పుడు రైతాంగంలో ఆందోళన రేకెత్తిస్తోంది. ఇరిగేషన్ శాఖను బిల్లుల సమస్య వేధిస్తోంది. చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు అవస్థలు పడుతున్నారు. దీంతో కొత్తగా వీరి చేత పనులు చేయించుకోవడం అధికారులకు ఇబ్బందిగా మారింది.

- వివరాలు 8లో..

చౌటపాళెం సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌటపాళెం సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. చవటపాళెం సొసైటీ అధ్యక్షుడిగా తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమ నాయుడు, డైరెక్టర్లుగా తాటిపర్తిపాళెనికి చెందిన టీడీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు యనమల కృష్ణయ్య, కంటేపల్లికి చెందిన తెలుగుయువత జిల్లా కార్యదర్శి ఆస్తోటి నాగరాజులు ప్రమాణస్వీకారం చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9498
వెండి కిలో ధర	రూ. 116900
వెండి ఒక గ్రాము	రూ. 119.90



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ ప్రసాద్, సూపరింటెండెంట్, పొదలకూరు సీహెచ్‌సీ

పొదలకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ప్రజలకు సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉంటే దోమ కాటుతో మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ జ్వరాలు వస్తాయన్నారు.

? : ప్రస్తుతం సీహెచ్‌సీలో ఓపీ ఎలా ఉంది.

! : రోజూ 250 నుంచి 350 వరకు రోగులు వస్తున్నారు. ప్రస్తుతం సదరన్ క్యాంపు జర గడంతో రోగుల సంఖ్య పెరిగింది.

? : ఎక్కువగా ఎలాంటి వ్యాధులతో రోగులు ఆసుపత్రికి వస్తున్నారు.

! : జ్వరం, జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులతో ఎక్కువ మంది చికిత్స కోసం వస్తున్నారు.

? : రాష్ట్ర ప్రభుత్వం సీహెచ్‌సీకి ఎలాంటి సౌకర్యాలు కల్పించింది

! : రాష్ట్ర ప్రభుత్వం డయాసిస్ సెంటర్ ఏర్పాటుతోపాటు రూ.90 లక్షల విలువ చేసే అధునాతన వైద్య పరికరాలు, ఆల్ట్రా సౌండ్, స్కానింగ్ మిషన్, కంప్యూటర్లు, ఈసీజీ వంటి అత్యాధునిక పరికరాలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవ తీసుకుని ఏర్పాటు చేయించారు.

? : డయాలసిస్ సెంటర్ రోగులకు ఎలా ఉపయోగపడుతోంది

! : డయాలసిస్ సెంటర్ ఈ ప్రాంత ప్రజలకు వరం. వ్యవప్రయాసలు పడి నెల్లూరు దాకా వెళ్లకుండా డయాలసిస్ రోగులు ఇక్కడే చేయించుకుంటున్నారు. ఇప్పటి వరకు 350 సెషన్‌లు డయాలసిస్ చేశాం.

ర్యాలీకి 230 ట్రాక్టర్లు



జెండా ఊపుతున్న పచ్చిపాల రామిరెడ్డి

మనుబోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తలపెట్టిన ట్రాక్టర్ల ర్యాలీకి మండలం నుంచి 230 ట్రాక్టర్లు వెళ్లాయి. మనుబోలు నుంచి తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో 7ట్రాక్టర్లను మంగళవారం ఆయన జెండా ఊపి పంపారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థికసాయం అందించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యదర్శి రాయపాటి కిరణ్, గ్రామ అధ్యక్షుడు మారరెడ్డి రమణారెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు చింతల వెంకటేశ్వర్లు, కలికి బ్రదర్స్, గుంజి సతీష్ పాల్గొన్నారు.

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనికేపల్లిలో మంగళవారం రైతు సంఘం నేత ముంగర చెంచురామయ్య అధ్యక్షతన రైతు సంఘం 5వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గోపీ, కార్యదర్శిగా ఓడూరు వెంకటకృష్ణయ్యతో పాటు ఎనిమిదిమందిని ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, కార్యదర్శి మూలి వెంగయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని వారు విమర్శించారు. సర్వేపల్లి రిజర్వాయర్ పరిధిలోని 5వ నంబరు తూముకు మరమ్మతులు చేయాలన్నారు. నిడిగుంటపాళెం, అనికేపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు కసుమూరు దర్గా హుండీ లెక్కింపు

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గా హుండీని బుధవారం లెక్కిస్తున్నట్లు దర్గా ఈఓ షేక్ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు, గ్రామస్తులు, దర్గా ముజావర్ల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు.

'పాడి'కి పాడె కట్టారు!

● నిరుపయోగంగా పాల శీతలీకరణ కేంద్రాలు
● వైసీపీ హయాంలో తుప్పుపట్టిన యంత్రాలు

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు రంగంలో జరుగుతున్న దోపిడీ నుండి పాడి రైతులను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన పాలశీతలీకరణ కేంద్రాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రైవేటు డైరీలు పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్న కారణంగా రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ 2008లో జిల్లాలో మూడు పాలశీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో కేంద్రానికి అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షలకు పైగా వెచ్చించింది. మండల కేంద్రాలైన వెంకటాచలం, పొదలకూరు, చేజర్లలో ఈ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అప్పట్లో రాష్ట్ర సమాచార, టూరిజం శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈ మూడు కేంద్రాలను ప్రారంభించారు. గ్రామాల్లో డ్వాక్రా మహిళల ద్వారా పాలను సేకరించి ఈ శీతలీకరణ కేంద్రాలకు తరలించడం, తద్వారా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.



నిరుపయోగంగా ఉన్న పాలశీతలీకరణ కేంద్రం

ప్రైవేటు డైరీల కంటే ఎక్కువ ధర పాడి రైతులకు లభిస్తుండడంతో ఈ కేంద్రాలకు పాలు పోసే వారి సంఖ్య క్రమంగా పెరిగింది. దీంతో ఈ కేంద్రాలకు గత టీడీపీ ప్రభుత్వ హయాం వరకు పాల సరఫరా సక్రమంగానే సాగింది. తర్వాత ఈ కేంద్రాల నిర్వహణలో రాజకీయాలు చోటు చేసుకున్నాయి. వీటిని తమవారే నిర్వహించాలని నేతలు పట్టుబట్టడంతో ఇవి క్రమంగా మూతపడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం అయితే పాల శీతలీకరణ కేంద్రాల నిర్వహణ విషయాన్నే పూర్తిగా విస్మరించింది. దీంతో నాటి నుండి ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు విలువ చేసే శీతలీకరణ యంత్రాలు తుప్పుపట్టిపోతున్నా. వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. రైతులు మాత్రం తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోయినా ప్రైవేటు డైరీలకే తమ కష్టాన్ని ధారబోస్తున్నారు. ఈ కేంద్రాల పట్ల ఏ ఒక్క అధికారి కూడా శ్రద్ధ పెట్టడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పాలశీతలీకరణ కేంద్రాలను మళ్లీ తెరిచి పాడి రైతులకు అండగా నిలవాలని, ఆ దిశగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కృషి చేస్తారని నియోజకవర్గ రైతులు ఆశతో ఉన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

● ఎస్‌బీఐ ఆర్‌ఎం సత్యనారాయణ స్వామి



మాట్లాడుతున్న ఆర్‌ఎం సత్యనారాయణ స్వామి

మనుబోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బిఐ (భారతీయస్టేట్ బ్యాంకు) రీజనల్ మేనేజర్ బి. సత్య నారాయణ స్వామి కోరారు. మడమనూరులో గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, ఖాతా దారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రూ. 20తో రూ. 2లక్షల ప్రమాద బీమా పథకం ప్రవేశపెట్టిందన్నారు. రూ. 436తో సహజ మరణానికి రూ. 2లక్షల బీమాను కూడా అమలు చేస్తోందన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకాన్ని కూడా తీసుకువచ్చిందన్నారు. వీటిపై గ్రామాల్లో సెప్టెంబర్ నెలాఖరు వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబోతున్నామన్నారు. ప్రతి ఒక్కరికి పొదుపు అవసరమన్నారు. బీమాలు కడితే ఆపదల్లో కుటుంబాలను ఆదుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శర్మ, ఎఫ్ఐ మేనేజర్ రమేష్, సీనియర్ అసోసియేట్ వి. రత్నం, మనుబోలు ఎస్‌బీఐ మేనేజర్ సంతోష్ కుమార్, లక్ష్మణ్, ఏపీఎం వనజాక్షి, హెచ్‌ఎం వీవీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమాలపై విజిలెన్స్ తనిఖీలు



పరిశీలిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ కరకట్ట పరిసరాల్లో గ్రావెల్ అక్రమాలు జరిగిన ప్రాంతాన్ని మంగళవారం విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే నెంబరు 920/ఏ లోని కనిగిరి రిజర్వాయర్‌కు చెందిన భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. 920/ఏ లోని కనిగిరి రిజర్వాయర్, పరిసర ప్రాంతం జలవనరుల శాఖకు సంబంధించిన భూమిగా రికార్డుల్లో ఉంది. ఈ ప్రాంతంలో భారీగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగినట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు వెంటనే నీటిపారుదల శాఖ అధికారులకు ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో త్వరలో ఇరిగేషన్ అధికారులకు ముందస్తు సమాచారమిచ్చి, వారితో కలిసి మరోసారి తనిఖీలు చేపడతామని వెనుదిరిగారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాని, అసిస్టెంట్ జియాలజిస్ట్ సుబ్బయ్య, మండల సర్వే అధికారి సోమేశ్వరరావు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

కాలువలు నిండి... మురుగు పొంగి!

● ముద్దమూడిలో అధ్వానంగా పారిశుధ్యం ● ప్రబలుతున్న వ్యాధులు



ముద్దమూడిలో నిల్వ ఉన్న మురుగునీరు

మనుబోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మురుగు కాలువలు లేక ఇళ్లలోంచి వచ్చే మురుగునీరు నిల్వ చేరిందని చిత్రం చూసి అనుకోకండి. ఇక్కడ మురుగుకాలువలు ఉన్నాయి. అవి నిండి, వాటిలోంచి మురుగుముందుకు పోక ఇలా నిల్వ చేరింది. దీనిని బట్టిచూస్తే వారాలు... నెలల తరబడి ఇక్కడ పంచాయతీ సిబ్బంది కాలవల్లో పేరుకుపోయిన మురుగునీటిని తొలగించడం లేదన్నది తెలుస్తోంది. దళితకాలనీల్లో ఉన్న మురుగుకాలువలంతా ఇదే పరిస్థితి. నిండుగా మురుగు నిండి దర్శనమిస్తున్నాయి. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లో మురుగునీరు తొలగించి,దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



దర్శనమిస్తున్న శ్రీకృష్ణ భగవానుడు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించు కుని బుచ్చిరెడ్డి పాళెం పుట్టవీధి, హౌస్‌తోట ప్రాంతాల్లో ఈనెల 16న నెలకొల్పిన శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమలను మంగళవారం భక్తితో పలు వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బుచ్చి తహసీల్దారుకు రెవెన్యూ ఉద్యోగుల సన్మానం



తహసీల్దారును సన్మానించిన రెవెన్యూ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పురపాలకశాఖా మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దారు అవార్డు అందుకున్న బుచ్చి తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లును మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు భాగ్యలక్ష్మి, ఆర్ఐ శాంతిప్రియ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ సోమేశ్వరరావు, వీఆర్వోలు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దారుకు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

ఉత్పత్తి... అంతా ఉత్తదే!

● కేంద్రాల వైపు కన్నెత్తి చూడని అధికారులు



మడమనూరు చెత్తసంపద కేంద్రంలో దుస్థితి

మనుబోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మీరు చూస్తున్నది మడమనూరు చెత్త సంపద కేంద్రం. గ్రామంలో ఉన్న చెత్తను సేకరించి ఈ కేంద్రానికి తరలించాలి. అక్కడ తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి వ్యర్థాలను పొడిచేసి వర్మికంపోస్టు ఎరువు ఉత్పత్తి చేయాలి. తద్వారా దానిని అమ్మకాలు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలి. ఇది చెత్త నుంచి సంపదతయారీ కేంద్రాల ఉద్దేశ్యం. అయితే కేంద్రాలలో అలాంటివేమి జరగడం లేదనడానికి ఇదో నిదర్శనం. గ్రామంలో వచ్చిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు గోతాలకు నింపి కేంద్రాల్లో ఇలా పడేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయా, లేదా, ఇంటింటి నుంచి చెత్తసేకరిస్తున్నారా, లేదా అని పరిశీలిస్తున్నారే తప్ప అధికారులు కేంద్రాల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

కందలపాడులో ఉచిత పశు వైద్య శిబిరం

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందలపాడులో మంగళవారం స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశుసంవర్థక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండవ ఫౌండేషన్ పశువైద్యాధికారి డాక్టర్ వీ శ్రీనివాసులు నాయుడు, కనుపూరు పశు వైద్యాధికారి డాక్టర్ మంజునాథ్ సింగ్ పశువులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భకోశ వ్యాధులు, ఎదకు రాని గేదేలకు మందులు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు సుబ్బయ్య, నితిషా, శ్రావణ్‌కుమార్, సుధీర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' కోసం పేర్లు నమోదు చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

కోవూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకం నమోదు కోసం రైతులు ఈనెల 20తేదీ వరకు నిర్వహించే గ్రీవెన్స్ ద్వారా దరఖాస్తులను గ్రామంలోని సంబంధిత రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించి నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి టి. రజని రైతులకు తెలిపారు. కోవూరు మంగళవారం మండలంలోని చెర్లోపాళెం, పడుగుపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 50శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులు జీలుగలు పంపిణీ చేస్తున్నట్టు రైతులకు తెలిపారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు కీర్తన, మొహర్‌వున్నీసా, రైతులు పాల్గొన్నారు.

మనుబోలు : వరిసాగుకు ముందు భూమిలో పచ్చిరొట్ట ఎరువులు సాగుచేసి భూ సారం పెంచాలని పొదలకూరు ఏడిఏ శివనాయక్ అన్నారు. వీరంపల్లిలో మంగళవారం 'పొలం పిలు స్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. గుమ్మ డి తోటలను పరిశీలించిన అనంతరం ఏడీఏ రైతులతో మాట్లాడారు. నానో యూరియా, డీఏపీలను వాడుకోవచ్చునన్నారు. రైతులకు ఆ విషయంలో సందేహం అవసరం లేదన్నారు. గుమ్మడి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్య క్రమంలో ఏవో వెంకటకృష్ణయ్య, వీఏఏలు శివ కుమార్, విజేత తదితరులు పాల్గొన్నారు.

సైదాపురం: మండలంలోని అనంతమడుగు, పాలూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి హైమావతి మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డులు పొందాలన్నారు. భూమిలేని కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పొందడం గొప్ప అవకాశమని, వీఆర్వో దగ్గరకు వెళ్లి ఆధార్, పాస్‌పోర్టో, కౌలు రాసుకున్న పత్రం తీసుకెళ్లి సీసీఆర్‌సీ పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఐరిష్

● కొత్త విధివిధానాలు ప్రకటించిన కేంద్రం
● అమలుపై అధికారులకు శిక్షణ
● అక్రమాలకు చెక్‌పడేనా?



మర్రిపాడు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు (ఫైల్)

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాలకు పని కల్పించేందుకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో అక్రమాలు, అవినీతికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధి విధానాలను రూపొందించింది. ఈ పథకం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. పని దొరకని కుటుంబాలకు ఏడాదిలో 100 రోజులు పని కల్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా దీనిని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా జిల్లాలో ఏడాదికి రూ.300 కోట్లకుపైగా నిధులతో పేదలకు ఉపాధి కల్పిస్తోంది. జిల్లాలో 3.66 లక్షల మందికి జాబ్ కార్డులను ప్రభుత్వం అందించింది. అయితే వారిలో 2.68 లక్షల మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. తద్వారా రోజుకు రూ.150 నుంచి రూ.200 వరకు వేతనం పొందుతున్నారు. అయితే ఈ పథకంలో కొందరు పాలకులు, అధికారులు, సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు.

● అక్రమాలు ఇలా...

అర్హత కలిగిన పేదలకే జాబ్ కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఉపాధి హామీ సిబ్బంది, ఉద్యోగులు కుమ్మక్కై బినామీ పేర్లతో జాబ్ కార్డులను భారీగా సృష్టించుకుని నిధులు కాజేస్తున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానంలో ఉపాధి పనులకు హాజరైన వారి గ్రూప్ ఫొటోలు తీసి యాప్‌లో పొందుపరుస్తున్నారు. అయితే జాబ్ కార్డు కలిగిన వ్యక్తి పని చేయక పోయినా ఫొటో తీసే సమయానికి హాజరవడం గానీ, బయటి వ్యక్తులను వారి స్థానంలో పెట్టి ఫొటోలు తీసి యాప్‌లో పొందుపరచడంగానీ చేస్తున్నారు. తద్వారా ఎక్కువ మంది పనులకు హాజరైనట్లు చూపుతూ నిధులను మింగేస్తున్నారు.

● కొత్త నిబంధనలతో కట్టడి చేసేనా?

బినామీ జాబ్ కార్డుల వ్యవహారం బయటపడుతుండటంతో దీనిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. ఉపాధి పనులకు హాజరయ్యే ప్రతీ ఒక్కరికి నుంచి ఐరిష్ (కనుపాప) ఫొటో తీయాలని నిర్ణయించింది. నాలుగు గంటల వ్యవధిలో రెండు సార్లు ఉపాధి కూలీల కళ్ల ఫొటోలు తీసి ఆ యాప్‌లో పొందుపరిచేలా విధి విధానాలను రూపొందించింది. అలాగే పనుల పర్యవేక్షణను కేవలం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవోలే కాకుండా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఏపీడీలు కూడా పర్యవేక్షించేలా విధి విధానాలను రూపొందించింది. దీనికి సంబంధించి శిక్షణ తరగతులను అధికారులు దాదాపుగా పూర్తి చేశారు. త్వరలో కొత్త విధానాలు అమలు కాబోతున్నాయి. కొత్త పద్ధతిలో అయినా అవినీతి, అక్రమాలను అరికట్టి అర్హులైన నిరుపేదలకే ఉపాధి కల్పించాలని అందరూ భావిస్తున్నారు.

మహిళ మృతదేహానికి పోస్టుమార్టం

కావలిరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామ సమీపంలో జామాయిల్ తోటలో గుర్తించిన కుళ్లిపోయిన గుర్తు తెలియని మహిళ మృతదేహానికి మంగళవారం నెల్లూరు ఫోరెన్సిక్ వైద్యుడు సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఆ మహిళ వయస్సు 60 నుంచి 65 ఏళ్లు ఉండవచ్చని వైద్యుడు నిర్ధారించారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐ బాజీబాబు పర్యవేక్షణలో ఈ పోస్టుమార్టం జరిగింది.

18 మద్యం సీసాల స్వాధీనం

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవరం గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణంపై ఉదయగిరి ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్ మంగళవారం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 18 మద్యం సీసాలతోపాటు నిర్వాహకుడు మధును అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.


పంచాయతీ భవనం కూల్చివేతపై విచారణ

కావలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలంచర్లలో పాడుబడిన పంచాయతీ భవనం కొంతభాగం తొలగింపుపై కలెక్టర్ ఆనంద్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో మంగళవారం ఎంపీడీవో శ్రీదేవి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ భవనం కూల్చివేతపై గ్రామానికి చెందిన తల్లిబోయిన సురేష్ ఈనెల 11వ తేదీ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని దానిపై గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టామన్నారు. గ్రామసభ పెట్టి ఆస్థలం తీసుకుని ఉంటే మాకు ఎలాంటి అభ్యంతరం ఉండేది కాదని, టీడీపీ నాయకులు తమ ఇష్టానుసారం తొలగించారని ఫిర్యాదుదారుడు తెలిపాడు. స్థానిక టీడీపీ నాయకులు మాత్రం 4నెలల క్రితం పంచాయతీరాజ్ ఏఈ ఈ భవనాన్ని పరిశీలించి నివాసయోగ్యమైనది కాదని, తొలగించవచ్చని సర్టిఫికెట్ ఇవ్వడంతో పంచాయతీ తీర్మానం పెట్టి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రాములవారి గుడి అవసరాల కోసం కొంత భాగాన్ని తొలగింపునకు గ్రామానికి చెందిన 150 మంది సంతకాలతో సచివాలయంలో అర్జీ కూడా ఇచ్చామని తెలిపారు. ఎమ్పీడీవో శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలు తొలగింపు పంచాయతీ తీర్మానంతోపాటు అధికారుల అనుమతి ఉండాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కార్యదర్శి శ్యామ్‌ను ఆదేశించారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, వైసీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సుందరయ్య కాలనీ బీ బ్లాకులో నివసిస్తున్న సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ చిరంజీవి ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు సమాచారం మేరకు... చిరంజీవి 24-1 సచివాలయంలో పనిచేస్తున్నారు. ఈ నెల 6వ తేదీ తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ఆయన ఇంట్లోకి ప్రవేశించి నాలుగు గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు, మూడు ఫోన్లు దోచుకెళ్లాడు. దీనిపై బాధితుడు ఆలస్యంగా మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ సరుకులు ఇంటికి తరలింపు



ఆటోలో ఉన్న అంగన్‌వాడీ సరుకులు

పొదలకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సరుకులను ఆటోలో ఇంటికి తరలిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తను స్థానికులు అడ్డగించి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని తోకంచి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం నుంచి అంగన్‌వాడీ కార్యకర్త బాలామృతం, కోడిగుడ్లు, రాగిపిండి, ఖర్జూరం ఆటోలో తరలిస్తుండగా స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తను వివరణ కోరగా తాను స్కూల్లో సరుకులు ఉంచుకునే అవకాశం లేకపోవడంతో ఆటోలో లబ్ధిదారులకు ఇచ్చేందుకు తీసుకెళ్తుండగా వారు అడ్డగించినట్లు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 520



ఘనంగా త్రిపుర సుందరికి కుంకుమ పూజ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ మంగళవారం సందర్భంగా ఉదయం త్రిపుర సుందరిదేవికి కుంకుమ పూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. వడ్లపూడి మస్తానమ్మ, సముద్రాల మస్తానమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం పూలంగిసేవ, 108 మంది మహిళలకు కుంకుమ, పసుపు, గాజుల పంపిణీ జరిగింది. గాదాల పద్మావతి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్‌రావు, సభ్యులు పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

జాఫువా గ్రంథాలయ నిర్మాణానికి సహకారం

● ఎమ్మెల్సీ బీద

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జాఫువా గ్రంథాలయ పునర్నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర హామీ ఇచ్చారు. మంగళవారం ఆ గ్రంథాలయ కమిటీ సభ్యులు మంగళవారం బీదను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పునర్నిర్మాణానికి అంచనాలతో నివేదిక ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఓవై నందన్‌ను ఎమ్మెల్సీ కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం, ఏవీ సుబ్బారావు, గంధం అంకయ్య, జెన్ని రమణయ్య, జనార్దన్, ఖాజా మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీవీ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్‌లో ఫోర్ ఇన్ వన్ డీసీ మాడ్యూల్ యూనిట్ ఏర్పాటు కారణంగా మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, మినీ బైపాస్ రోడ్డు, రవీంద్ర నగర్, వనంతోపు సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధిలో మంగళవారం సంస్థ పాలక మండలి సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, ఆయన మిత్రులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో దాతలు పోలయ్య, కృష్ణమూర్తి, చింతగుంట శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ కార్యాలయం కార్యదర్శి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు ఆగకూడదు : ఎంహెచ్‌వో



కాలువల్లో పూడికతీతను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో కనకాద్రి

నెల్లూరు రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : వర్షాలు భారీగా వచ్చినా ఇళ్ల మధ్యనున్న కాలువల్లో మురుగు పారుదల ఆగకూడదని ఎంహెచ్‌వో కనకాద్రి ఉద్యోగులను ఆదేశించారు. వర్షసూచనల నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా 27,28,29 డివిజన్లలోని కాలువల్లో మంగళవారం పూడిక తీయించారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, కుండీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. కాగా, కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ విభాగం వారాంతపు సమీక్షలో డీసీ చెన్నుడు పాల్గొన్నారు.

25న పౌరాణిక నాటక ప్రదర్శన

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రంగస్థల నటీమణి బండారు పద్మావతి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల 25న టౌనుహాలులో పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు జిల్లా పద్య నాటక కళాకారుల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి భక్తచింతామణి, బాలనాగమ్మ, సత్యహరి శ్చంద్ర నాటకంలోని సన్నివేశాల ప్రదర్శన జరుగుతుందని పేర్కొంది. కళాభిమానాలు తరలిరావాలని కోరింది.

ఓసీలతో బీసీలను కలపొద్దు

● డీఎస్సీ అభ్యర్థుల ఆవేదన

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియలో ఓసీలతో బీసీలను కలపొద్దని డీఎస్సీ బీసీ అభ్యర్థులు ఎం శ్రీనివాసులు, పీ సుధీర్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీజీటీ, పీజీటీ పరీక్షల్లో ప్రొఫిషియన్సీ టెస్ట్ నందు ఎస్సీ అభ్యర్థులకు 50 శాతం క్వాలిఫై మార్కులుగా ప్రకటించారని తెలిపారు. అయితే బీసీ అభ్యర్థులకు మాత్రం ఓసీ అభ్యర్థులతో సమానంగా 60 శాతం క్వాలిఫై మార్కులు ఇవ్వడం వల్ల అనేక మంది బీసీలు నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో ఆర్ ధరణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చం(దం)దాలు

వినాయక చవితికి భారీగా వసూళ్లు



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా వినాయక చవితికి జోరుగా చం(దం)దాలు వసూలు చేస్తున్నారు. పల్లెలు, పట్టణాలన్న బేధం లేకుండా ప్రతీ సంవత్సరం చవితి పండుగను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. జిల్లాలో ఏడాది ఏడాదికి కన్నుల పండువగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నెల్లూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా తాత్కాలిక గణపతి మండపా లు ఐదు వేలకు పైగా ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా. మండ పాల నిర్మాణం, విద్యుద్దీపాలంకరణ, నిత్య పూజలు, అన్నప్రసాదాలు, నిమజ్జనం, ఊరేగింపు వంటివి పోటాపోటీగా జరుగుతాయి. ఇందుకోసం ప్రస్తుత ధరల ప్రకారం కనీసం రూ.50వేల నుంచి రూ.15, 16లక్షల వరకు నిర్వాహకులు ఖర్చు చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది గణేష్ ఉత్సవాలకు జిల్లాలో దాదాపు రూ.7కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా. ఈ క్రమంలో నిర్వాహకులు భారీ ఎత్తున చందాలు వసూలు చేస్తున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గతేడాది కంటే 20శాతం అదనంగా ఫిక్స్ చేసి వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. ఉత్సవ కమిటీల్లో ఎక్కువగా రాజకీయ నాయకులే ఉంటుండటంతో చందాల వసూళ్లకు వారి అండ ఉందనే ఆరోపణలున్నాయి.

కాగా, వినాయక చవితి పండుగతో ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. బొమ్మల తయారీదారులు, మండపాల నిర్మాణ కార్మికులు, షామియానాలు, విద్యుద్దీపాలంకరణ కార్మికులు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారులు, పూజారులు, ప్రసాదం, లడ్డుల తయారీదారులు, వస్త్ర వ్యాపారులు, విద్యుత్ శాఖకు, ఫ్లెక్సీలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, ట్రాక్టర్లు, ఇతర వాహనదారులకు కూడా ఉపాధి లభిస్తుంది. గణేష్ ఉత్సవాలు అంటే ఐక్యత, భక్తికితోడు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నందున చందాలు దందాలుగా మారినా ప్రజలు ప్రోత్సహిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా రాత్రి కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి భక్తులతో ఈ వ్రతం చేయించారు. ఉదయం చండీ హోమం, సుందరేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగాయి.

శాంతియుతంగా జీవించాలి

మానవులు ఆశా, వ్యామోహం వీడి శాంతితో జీవించాలని బ్రహ్మకుమారి ఈశ్వరీ విశ్వ విద్యాలయం సౌత్‌జోన్ ఇన్‌చార్జి అంబికా దీది తెలిపారు. మంగళవారం వేదాయపాలెంలోని బ్రహ్మకుమారి విద్యాలయం, ఐశ్వర్య విశ్వవిద్యాలయా ల్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. నేడు ప్రపంచంలో కొన్ని దేశాలు యుద్ధాలతో ఆస్తి, ప్రాణ నష్టం కలిగిన తర్వాత శాంతిని కోరుకుంటున్నాయని ఆవేదన చెందారు. కృష్ణాష్టమి సందర్భంగా నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను, భగవద్గీత శ్లోకాన్ని పఠించిన చిన్నారి ధృవకుమార్ రాజును సత్కరించారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ క్లబ్ కార్యాలయంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ జాకీర్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన తీసే ఫొటోల విశిష్టతను, ఆంధ్రజ్యోతికి అందిస్తున్న సేవలను కొనియాడారు. అలాగే క్లబ్ సభ్యుడు కోదండపాణి, మరొక ఫొటోగ్రాఫర్ జయన్‌బాబును కూడా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి విశ్వనాథ్, కోశాధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా రాధాకృష్ణుడి నిమజ్జనం

● ముగిసిన జన్మాష్టమి వేడుకలు



బాలాజీనగర్‌లో రాధాకృష్ణుల నిమజ్జన నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నగరంలోని బాలాజీనగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రాధాకృష్ణుల విగ్రహ నిమజ్జన నగరోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. చిరంజీవి సేవా సమితి అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు, బాలాజీనగర్ యూత్ సంయుక్తంగా నాలుగు రోజులు ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం జరిగిన నిమజ్జనోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నగరోత్సవాన్ని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. కోలాట నృత్యాలు, బాణాసంచా వేడుకలతో ఉత్సవం సాగింది. అనంతరం పెన్నా ఘాట్‌లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల హనుమంతరావు, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, కొట్టే సోదరులు పాల్గొన్నారు.

నిధుల సమీకరణలో ఎమ్మెల్యే దిట్ట: కలెక్టర్ ఆనంద్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఆగస్టు 19,(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులకు నిధులు ఎలా... ఏఏ మార్గాల ద్వారా సమీకరించా లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి బాగా తెలుసని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. మంగళవారం రూరల్లోని పొట్టే పాళెం గ్రామంలో ఎమ్మెల్యేతో కలిసి రూ.1.40 కోట్లతో నిర్మిం చతలపెట్టిన పలు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ తన తెలియని విషయాలు కూడా చెప్పి నిధులు ఎక్కడ ఉన్నాయి.. ఎలా తీసుకురావాలో ఎమ్మెల్యే సలహా ఇస్తుంటారన్నారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పని చేసే కలెక్టర్ జిల్లాలో ఉండటం సంతోషమన్నారు. ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నేత కోటం రెడ్డి గిరి ధర్‌రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి సురేం ద్రరెడ్డి, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, అచ్యుత్‌రెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష

గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరినీ ఉపాధి హామీ పథకంలో సభ్యులుగా చేర్చి లబ్ధి చేకూర్చాలని ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. ప్రజలకు, రైతులకు అవసరమైన పనులను గ్రామ సభల ద్వారా గుర్తించి భాగస్వామ్యం కల్పించాలన్నారు. ఎంపీడీవో శైలేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా 'సవరణ' వద్దు

● సీపీఎం నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వద్దని సీపీఎం నాయకుడు, నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, పార్టీ రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వల్ల అనేక మంది తాము భారత పౌరులమని నిరూపించుకోవాల్సి వస్తుందన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఓటర్ల జాబితాను పూర్తిగా పరిశీలించక ముందే బిహారులో పెద్ద ఎత్తున విదేశీ ఓటర్లు ఉన్నట్లు కొన్ని మీడియా సంస్థలు, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాలు ప్రచారం ప్రారంభించాయని విమర్శించారు. ఈ ప్రచారాన్ని ఎన్నికల సంఘం ఖండించక పోవటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆ రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికల్లో అధికారం నిలబెట్టుకునేందుకు బీజేపీ ఎస్ఐఆర్‌ను ఉపయోగిం చుకుంటోందని ఆరోపించారు. వెంటనే ఓటర్ల తొలగింపు ప్రయత్నాలను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెంచలనర్సయ్య, సతీష్, నాగేశ్వర్‌రెడ్డి, సుధాకర్, సంపత్‌కుమార్ షాహినాబేగం, రఫీ, మాలకొండ య్య తదితరులు పాల్గొన్నారు.

ఈసీ పనితీరు పారదర్శకంగా ఉండాలి

● కాంగ్రెస్ పార్టీ కొవ్వొత్తులతో నిరసన



గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో కాంగ్రెస్ నాయకులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఎలక్షన్ కమిషన్ పనితీరు పారదర్శకంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని గాంధీబొమ్మ వద్ద కాంగ్రెస్ పార్టీ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పారదర్శకంగా ఎన్నికలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తెలిపిన అసంబద్ధ సమాధానాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయన్నారు. గతంలో స్వతంత్రంగా వ్యవహరించిన ఎలక్షన్ కమిషన్ ఇప్పుడు బీజేపీకి వత్తాసు పలకటం బాధాకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లాఉద్దీన్, సుధీర్, రెహమాన్, మల్లికార్జునరెడ్డి, సుజాత, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్సుల ఆందోళన

● దాడి చేసిన సీనియర్ రెసిడెంట్స్‌పై చర్యలకు డిమాండ్



జీజీహెచ్‌లో ఆందోళన చేస్తున్న స్టాఫ్‌నర్సులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం స్టాఫ్‌నర్సులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రిలో సోమవారం మేల్ స్టాఫ్‌నర్సుపై సీనియర్ రెసిడెంట్ వైద్యుల దాడికి నిరసనగా ఆందోళనకు దిగారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు వరలక్ష్మి, కాంట్రాక్టు నర్సింగ్ అసోసియేషన్ నేత మాధురి మాట్లాడుతూ మేల్ స్టాఫ్‌నర్సు వెంకట్‌పై సోమవారం సాయంత్రం సీనియర్ రెసిడెంట్ డాక్టర్ తేజ, జూనియర్ వైద్యులు అనిల్, దినేష్, గగన్, భార్గవ్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. స్టాఫ్ నర్సులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అదుపులోకి తీసుకుని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు శాంతకుమారి, కల్యాణ్ కుమార్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

'సుఖీభవ' కోసం ఎన్‌పీసీఐ లింకు చేసుకోవాలి

● ఏడీఏ శ్రీదేవి, ఏవో నాగమోహన్



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

నెల్లూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం నిధులు అందని రైతులు వెంటనే స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది వద్దకు వెళ్లి ఎన్‌పీసీఐ లింకు చేసుకోవాలని నెల్లూరు ఏడీఏ శ్రీదేవి, ఏవో నాగమోహన్ సూచించారు. మంగళవారం పొట్టేపాళెం, కొండ్లపూడి గ్రామాల్లో రైతులతో సదస్సులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులందరూ విధిగా రైతు సేవ కేంద్రాల వద్దకెళ్లి అక్కడున్న సిబ్బందితో ఎన్‌పీసీఐ లింకు చేయించుకోవాలని స్పష్టం చేశారు. అలా చేస్తేనే మలి విడతలో నిధులు జమవుతాయని చెప్పారు. పైగా పంట కోతకొచ్చినప్పుడు ప్రభుత్వ కేంద్రాలకు ధాన్యం అమ్ముకునే వీలుంటుందని తెలిపారు.

కర్ణాలమిట్ట పాఠశాలకు ఆర్వో ప్లాంట్



ఆర్వో ప్లాంటు వద్ద ఐడీబీఐ బ్యాంకు ఆర్‌వో చందన్, హెచ్ఎం శివరాంప్రసాద్ తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని కర్ణాలమిట్టలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (ఎంసీహెచ్ఎస్)కు ఐడీబీఐ వీఆర్సీ బ్రాంచి వారు మంగళవారం ఆర్వో ప్లాంట్, కంప్యూటర్, మైక్‌సెట్, రెండు బీరువాలను బహూకరించారు. వీటిని సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అందజేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాంప్రసాద్ తెలిపారు. ఐడీబీఐ ఆర్‌వో చందన్ ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. బ్రాంచి మేనేజరు బాలాజీ మాట్లాడు తూ బ్యాంకు ద్వారా జీరో బ్యాలెన్స్ ఖాతాను ఓపెన్ చేసి పిల్లలకు, పిల్లల తల్లిదండ్రులకు ఫ్రెండ్లీ బ్యాంకింగ్ సేవలు అందచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రిలేషన్‌షిప్ మేనేజర్ బాబయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలివ్వాలి

● సీఐటీయూ రూరల్ అధ్యక్ష, కార్యదర్శుల డిమాండ్



మన్సూర్ భవన్ వద్ద అంగన్‌వాడీలు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రూరల్ అధ్యక్షకార్యదర్శులు కొండా ప్రసాద్, పెంచలనర్సయ్య డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మహాసభ మంగళవారం నగరంలోని మన్సూర్ భవన్‌లో జరిగింది. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీల గత 42 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలకు జూలై నెలలోనే వేతనాలు పెంచుతామని, గ్రాట్యుటీకి సంబంధించి కేంద్రానికి సిఫార్సు చేస్తామని, కారుణ్య నియామకాలు, మట్టిఖర్చులకు రూ.20వేలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. హెల్పర్ల ఉద్యోగోన్నతి వయసును 40 నుంచి 50 ఏళ్లకు పెంచుతామని ఒప్పందం చేసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. అనంతరం 31 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ షాహినాబేగం, సీఐటీయూ నాయకులు ఖాజావలి, సుధాకర్, షబ్బీర్, కృష్ణమూర్తి, రమ, నాగభూషణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి మూలకణ మార్పిడి చికిత్స



సమావేశంలో పాల్గొన్న వైద్యులు, ఆసుపత్రి నిర్వాహకులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ ఆసుపత్రి క్యాన్సర్ విభాగంలో అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు వైద్య నిపుణుడు డాక్టర్ రంగరామన్ తెలిపారు. ఆయన మంగళవారం ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతికి చెందిన రమణయ్య (57) అనే వ్యక్తి మల్టిపుల్ మైలోమా అనే రక్త క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడన్నారు. ఆయనకు మూల కణాల మార్పిడి (ఆటోలోగస్ స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని తెలియచేశారు. ఖరీదైన ఈ చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రమ ణయ్య, ఆసుపత్రి సెంటర్ హెడ్ రంజిత్ రెడ్డి, క్యాన్సర్ విభాగం హెడ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

లింకు డాక్యుమెంట్ పోయినది

నాసిన మహేష్ S/o. నాసిన మల్లికార్జున, ప్లాట్ నెం.401, హెచ్.ఎమ్.ఆర్ క్లాసిక్ అపార్ట్‌మెంట్, వెంకటగిరి, రోడ్ నెం.10, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణా- 500033, ఇండియా. ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ నెం.2395/1955 & 1598/1968 (S.R.O, Guntur), 2745/2000, 620/2001 (S.R.O, Nallapadu, Guntur District) నేను తేది:11-08-2025న నెల్లూరుజిల్లా, విడవలూరు, ఎస్ఎమ్ఆర్ గార్డెన్ నందు విపిఆర్ వాటర్ ప్లాంట్ వెనుక వైపు, నా బైక్ పార్కింగ్ చేసివున్నాను. బైక్ ట్యాంక్ కవర్‌లో ఉన్న లింకు డాక్యుమెంట్స్‌ను ఉంచి నేను పని నిమిత్తం వెళ్లి రాగా వచ్చి చూసే సరికి అవి కనిపించ లేదు. దొరికినవారు ఈక్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.
సెల్:73308 08576

మార్కెట్ కమిటీ కార్యదర్శికి సత్కారం



మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులును సత్కరిస్తున్న కూరగాయల వ్యాపారులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాసులును నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ వ్యాపారులు మంగళవారం సత్కరించారు. 2024-25 సంవత్సరానికి ప్రభుత్వం రూ.514లక్షల సెస్సు వసూలు లక్ష్యం విధించగా, అంతకు మించి రూ.539.90లక్షలను శ్రీనివాసులు వసూలు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవంలో అవార్డు అందుకున్నారు. దీనిని పురస్కరించుకుని మార్కెట్ వ్యాపారులు కార్యదర్శిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామ్, లక్ష్మణ్, అజీజ్, సురేష్, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ వర్షాలతో జాగ్రత్త సుమా!

- వరి, వేరుశనగ, నిమ్మ పంటలకు తెగుళ్లు ఆశించే అవకాశం
- మందులు పిచికారీ చేస్తే మంచిది
- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ప్రధానంగా వరి, వేరుశనగ పంటలు సాగులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా పంటలు తెగుళ్ల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. చిరుపొట్ట దశ నుంచి కంకి దశలో ఉన్న వరికి అకునల్లి, నల్లనొక్క, పొట్టకుల్లు తెగుళ్లు సోకే అవకాశం ఉంది. అదేవిధంగా వేరుశనగకు తిక్క మచ్చ, త్రుప్పు తెగులు, నిమ్మలో బంక తెగులు, వేరుకుళ్లు, గజ్జి తెగుళ్లు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. వీటి నుంచి పంటలను రక్షించుకునేందుకు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ విజయ కుమార్‌నాయక్ పలు సూచనలు అందిస్తున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వాతావరణ పరిస్థితులు పొట్టకుళ్లు, మానిపండు తెగుళ్లకు అనుకూలం. పొలాల్లో ఈ రెండు తెగుళ్లను గుర్తించారు. రైతులు ముందు జాగ్రత్తగా ప్రొపికొనజోల్ 200మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలి. వరిలో ప్రధానంగా ఆకు, కంకినల్లి తెగుళ్లను కూడా గుర్తించారు. అయితే కురుస్తున్న వర్షాలకు ఆకునల్లి తీవ్రత తగ్గుతుంది. అయినా వర్షం ఆగిన తరువాత నల్లి తీవ్రతను అక్కడక్కడా గుర్తిస్తే ప్రొఫెనోఫాస్ 400మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే స్పైరోమెసిఫెన్ 200మి.లీ పిచికారీ చేయాలి. అదేవిధంగా నల్లనొక్కు గుర్తిస్తే ప్రొఫెనోఫోస్ 400మి.లీ ఇంకా ప్రొపికొనజోల్ 200మి.లీ కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి. పంటలో ఎక్కడైనా సుడిదోమ ఉంటే ప్రొఫెనోఫాస్ పిచికారీ చేయాలి.

● వేరుశనగకు కుళ్లు తెగుళ్లు

వేరుశనగ పంటకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తిక్క మచ్చ, త్రుప్పు తెగులు అనుకూలం. దీన్ని గుర్తిస్తే వర్షం ఆగిన తరువాత టేబుకొనజోల్ 200మి.లీ లేదా టేబుకొనజోల్ 160గ్రాములు, ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ (నేటివో) రెండు కలిపి లేదా క్లోరోథలోనిల్ 400గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలి. వర్షం ఆగిన తరువాత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటే కాండం, వేరుకుళ్లు తెగుళ్ల తీవ్రత పంటకు ఎక్కువయ్యే అవకాశం ఉంది. పూతదశలో ఉన్న వేరుశనగ పంటలో ట్రైకొడెర్మ పొడిని పశువుల ఎరువులో కలుపుకుని పొలంలో తేమ ఉన్నప్పుడు చల్లుకోవాలి. 5-7రోజుల తరువాత ఎకరాకు సాఫ్ 400గ్రాముల పొడిని నేల తడిచేటట్టు పిచికారీ చేస్తే కొంతమేర ఈ తెగులును అరికట్టవచ్చు. జిప్సం ఇంకా వేయని రైతులు పూతదశలో ఎకరాకు 200కేజీలు వేసుకోవడం వల్ల కుళ్లు తెగుళ్ల తీవ్రత తగ్గించుకోవడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చు.



ఇందుకూరుపేట మండలం నరుకూరులో తెగుళ్లు ఆశించిన వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

● నిమ్మలో బంక, వేరుకుళ్లు తెగులు

ఈ వాతావరణంలో నిమ్మ పంటకు బంక తెగులు, వేరుకుళ్లు, గజ్జి తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ట్రైకోడెర్మ అనే జీవనియంత్రణ నాశినిని పశువుల ఎరువు, వేప పిండిలో 15రోజులు మగ్గనిచ్చి పాదులు, చెట్ల మొదళ్ల దగ్గర కొద్దిగా మట్టి తీసి వేసుకోవాలి. తరువాత మట్టితో కప్పి నీళ్లు ఇవ్వాలి. బంక కారి కుళ్లిన బెరడును పూర్తిగా గోకి బోర్డోపేస్ట్ లేదంటే కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదంటే మాంకోజెబ్ పేస్టు పూయాలి. లీటరు నీటికి 1గ్రాము కర్బం డజిం మందు ద్రావణాన్ని చెట్టు మొత్తం తడిచేటట్టు 15రోజుల వ్యవధిలో 2-3సార్లు పిచికారీ చేయాలి. అదేవిధంగా లీటరు నీటికి 3గ్రాముల మాంకోజెబ్ కలిపిన 20-25లీటర్ల మందు ద్రావణాన్ని చెట్టు పాదుల్లో పోయాలి. నిమ్మలో గజ్జి తెగులు ఆశించిన కొమ్మలను కత్తిరించి 10లీటర్ల నీటిలో స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, 30గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు ద్రావణాన్ని 15రోజుల వ్యవధిలో 2-3సార్లు కొమ్మలపై పిచికారీ చేయాలి. కొమ్మలు కాండంపైన బెరడు గోకిన తరువాత బోర్డోపేస్ట్ ద్రావణాన్ని పూయాలి.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవాణి

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రం-1లో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాకు 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. జామాయిల్ తోటలు సాగు చేసే రైతులకు యూరియా పంపిణీ చేయరని, కాంప్లెక్సు ఎరువులు వాడుకోవాలని ఆమె సూచించారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి అవసరమైన వారికి యూరియా అందించాలన్నారు. పంట సాగు చేసిన ప్రతిరైతు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం అందని రైతులు సమీపంలోని రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని పేర్కొన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయగిరి ప్రాంత రైతులకు కందులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో మినుములు కూడా వస్తాయన్నారు. వ్యవసాయరంగంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీ రావు, లక్ష్మీమాధవి, శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారులు చెన్నారెడ్డి, మదన్ మోహన్, వెంకటసుబ్బారెడ్డి, విజయభాస్కర్, సునీల్, ఏఈవోలు, వీపీఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమాధికారికి ఉద్యోగోన్నతి



పరిమళ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా పని చేస్తున్న వీకే పరిమళకు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ప్రస్తుతం ఆమె ఆ శాఖాంశాలపై శిక్షణలో ఉన్నారు. శిక్షణ తరువాత నెల్లూరుకు వచ్చి రిలీవ్ అవుతారు. పాడేరులో డీడీగా బాధ్యతలు స్వీకరిస్తారు.

కాకాణి విడుదల్లో జాప్యం

- బెయిల్ పత్రాల సమర్పణ ఆలస్యం
- నేడు జైలు నుంచి విడుదల

నెల్లూరు(క్రైం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ కారాగారం నుంచి ఆయన విడుదల మరోరోజు ఆలస్యమవుతోంది. మాజీ మంత్రి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు విడుదలవుతారని అందరూ భావించారు. అయితే బెయిల్ పత్రాలను సెంట్రల్ జైలుకు సాయంత్రం 5 గంటల్లోపు అందించక పోవడంతో కాకాణి విడుదల నిలిచిపోయింది. బుధవారం ఉదయం 10 గంటల పైన కాకాణి విడుదలయ్యే అవకాశం ఉంది. కాగా, గోవర్ధన్‌రెడ్డికి భారీగా స్వాగతం పలికేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే కోర్టు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాట్లు చేయడంతో పోలీసులు బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించారు.

ఇదో రకం బ్లాక్‌మెయిల్ !

- ఆకాశరామన్న ఉత్తరాలతో బెదిరింపులు
- పంచాయతీ నిధులపై సమాచారం కోసం దరఖాస్తు
- ఆపై నగదు పంపాలని డిమాండ్


మర్రిపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు వస్తున్న ఆకాశ రామన్న ఉత్తరాలతో ఆయా పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. స్థానిక పంచాయతీలకు, మండలానికి సంబంధం లేనివారు పంచాయతీ నిధులు, జమాఖర్చుల వివరాలు కావాలని. ఎంబుక్‌లు, క్యాష్‌బుక్, పంచాయతీ తీర్మానాల సమాచారం ఇవ్వాలని దరఖాస్తు చేస్తూ రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఉత్తరాలు పంపుతున్నారు. సమాచారం ఇవ్వాల్సిన గడువు దగ్గరయ్యేకొద్దీ. సమాచారం కోరినవారు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా, ఫోన్ ద్వారా పంచాయతీ కార్యదర్శులను బెదిరిస్తున్నారు. అంతేకాక నగదు కోసం బేరసారాలాడుతున్నారు.

● స.హ.చట్టాన్ని అడ్డుపెట్టుకుని..

మర్రిపాడు మండలంలో గత 7,8 నెలల నుంచి ఇలాంటి ఘటనలు అధికమయ్యాయి. త్వరగా ఆ లెటర్‌ను ఏదో ఒకటి చేసి ముగించండి.. అంటూ వారికి మద్దతుగా కోరస్ పలుకుతూ కార్యాలయంలో కొందరు అధికారులు ఉంటున్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి సమాచారహక్కు చట్టం ఉపయోగకరంగా ఉంది. కానీ కొందరు అక్రమార్జనే ధ్యేయంగా ఆ చట్టాన్ని అడ్డం పెట్టుకొని దందాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ చట్టాన్ని వినియోగించుకుని ప్రతీ సామాన్యుడు ఏ కార్యాలయానికి వెళ్లినా పనిచేయించుకోవడం, తనకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైంది.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని 2005లో అమలులోకి తెచ్చింది. కానీ మండలంలోని పలు కార్యాలయాలకు నెల్లూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన సుమారు ఆరుగురి చిరునామాలతో ఉత్తరాలు వస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శులు పేర్కొన్నారు. ప్రతీ కార్యదర్శి ఒక్కొక్క ఉత్తరానికి కనీసం రూ. 5 నుంచి రూ. 10వేలు నగదును తప్పక పంపించాల్సి ఉంది. నెల్లూరు ఏసీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి గతనెల 7న సమాచారం కోరుతూ డీసీ పల్లి పంచాయతీకి ఉత్తరం పంపారు. సమాచారం ఇవ్వటానికి గడువు ముగుస్తుండటంతో ఏదో ఒకటి తేల్చమని పంచాయతీ కార్యదర్శికి వాట్సాప్ మెసేజ్ పెట్టాడు. అదేపనిగా ఉత్తరాలు రాస్తూ నగదు వసూళ్లకు పాల్పడుతున్న టీమ్ కూడా ఒకటి ఉన్నట్లు, ఆ టీమ్‌కు ప్రతీ మండలంలోని ఎవరో ఒక అధికారితో సంబంధాలు కలిగి ఉన్నట్లు మండల ప్రజలు అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



డీసీపల్లి పంచాయతీ నిధుల వివరాలు కావాలని కోరుతూ నెల్లూరుకి చెందిన వ్యక్తి చేసుకున్న దరఖాస్తు



సమాచార హక్కు చట్టం ప్రకారం సమయానికి కచ్చితమైన సమాచారం ఇవ్వాలని పంపిన వాట్సాప్ మెసేజ్

దూర విద్యావిధానంలో పది, ఇంటర్

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారు దూర విద్య ద్వారా పదో తరగతి, ఇంటర్ విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబరు 15వతేదీ వరకు రూ.200 అపరాధ రుసుముతో అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన ఉద్యోగులు, గృహిణులు, వివిధ వృత్తులు, వ్యాపార రంగాలవారు, ఆర్థికంగా వెనుకబడినవారు, ప్రజాప్రతినిధులు, బడి మధ్యలో మానేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వాంసచివాల యాల్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 89194228319 నెంబరునుగానీ సంప్రదించాలని సూచించారు.

ఉప ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే గుణపాఠం చెప్పారు

- 'అన్నదాత సుఖీభవ'తో రైతుల్లో రెట్టింపు సంతోషం
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల న్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తుండడంతో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెప్పారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలంలో మంగళవారం వందలాది ట్రాక్టర్లతో 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలం ఇసుక డంపింగ్ యార్డు నుంచి ఎర్రగుంట వరకు సుమారు 900పైగా ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేపట్టారు. తొలుత సోమిరెడ్డి ఎడ్ల బండిపైన, ఆ తర్వాత ట్రాక్టర్ ఎక్కి ఉత్సాహంగా విజయోత్సవంలో పాల్గొన్నారు. ఎర్రగుంట వద్ద కమ్యూనిటీ హాలులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.9300 కోట్లతో అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ' పథకంతో రైతుల్లో సంతోషం రెట్టింపయిందన్నారు. చంద్రబాబు హయాంలో వ్యవసాయానికి పూర్వవైభవం వచ్చిందన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకాలకు మహిళల నుంచీ విశేష స్పందన లభిస్తోందన్నారు. కేవలం నాలుగు రోజుల్లో 19 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నారు.



రైతు రథాన్ని నడుపుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వైసీపీ పాలనలో రాష్ట్రానికి గ్రహణం పడితే ఇప్పుడు పోలవరం, అమరావతి రాష్ట్రాభివృద్ధికి ఐకాన్‌గా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నేతలు రావూరి రాధాకృష్ణమ నాయుడు, బొమ్మి సురేంద్ర, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, జనసేన సమన్వయకర్త సురేష్ నాయుడు, టీడీపీ మండలాధ్యక్షులు, సొసైటీ, ఇరిగేషన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి పిలుపుతో రోడ్డెక్కిన వందలాది రైతు రథాలు

సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ విజయోత్సవ ట్రాక్టర్ల భారీ ర్యాలీ గ్రాండ్ సక్సెస్ అయింది. సంప్రదాయ పంచెకట్టుతో సోమిరెడ్డి విచ్చేశారు. అన్నదాతలు ఉత్సాహంగా ర్యాలీలో భాగ స్వాములయ్యారు. సోమిరెడ్డి ఇచ్చిన పిలుపుతో 900కుపైగా రైతు రథాలు రోడ్డెక్కాయి. జాతీయ రహదారిపై జాతరలా సాగింది. సూపర్ సిక్స్. సూపర్ సక్సెస్.. సర్వేపల్లి విజయోత్సవ ర్యాలీ డబుల్ సక్సెస్ అయిందంటూ సోమిరెడ్డి రైతులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

960.48 హెక్టార్లలో మొక్కల పెంపకమే లక్ష్యం

- డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

ఉదయగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు అటవీశాఖ కార్యాలయాల పరిధిలో 960.48 హెక్టార్లలో మొక్కల పెంపకమే లక్ష్యమని జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్‌వో) మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో గల చెక్కనగిషీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ మహిళలు తయారు చేస్తున్న వస్తువులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నర్సరీల్లో 20.65 లక్షల మొక్కల చేపట్టామన్నారు. గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఆయా రేంజ్‌ల పరిధిలో అధికారులు మొక్కలు నాటేందుకు ప్లాంటేషన్‌లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 60 హెక్టార్లలో మొక్కలు నాటామని తెలిపారు. అక్టోబరు నాటికి అన్నీ ప్లాంటేషన్లలో మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. చెక్కనగిషీ కేంద్రంలో వస్తువుల తయారీకి ఉపయోగించే నెర్థి, బిల్లనెర్థి, కలివి, వేప, దేవదారి కలప అందుబాటులో ఉండడంలేదన్నారు. వాటిని అటవీ శాఖ ప్లాంటేషన్లలో పెంచి, తయారీదారులకు కలపను సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని వివరించారు. అనంతరం మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ప్లాంటేషన్, దుర్గంపల్లి నర్సరీని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య, ఏబీవో బచ్చల వెంకటేశ్వర్లు, చెక్కనగిషీ కేంద్రం నిర్వాహకుడు షేక్ జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కనగిషీ కేంద్రంలో మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

బిల్లులేవి సార్!?

- ఇరిగేషన్ శాఖలో నిలిచిన బిల్లుల చెల్లింపు
- ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు
- ఓఅండ్ఎం బిల్లులు అప్‌లోడ్ చేసేందుకూ లేని బడ్జెట్
- డీఆర్సీలోనూ ప్రస్తావించిన ఎమ్మెల్యేలు
- రానున్న సీజన్‌పై ప్రభావం

నెల్లూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి కాలువలను నిర్వీర్యం చేశారు. పనులు చేయకుండానే చేసినట్లుగా చూపి బిల్లులు తినేశారు. ఆ ప్రభావంతో కాలువల్లో నీరు పారడం కూడా కష్టంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గతేడాది మొదటి పంట సమయంలో ఓఅండ్ఎం పనులు చేపట్టారు. ఓఅండ్ఎం హెడ్ కింద నిధులు లేకపోయినప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎస్‌డీఎంఎఫ్ (రాష్ట్ర విపత్తుల నిధి) నుంచి నిధులను కాలువల నిర్వహణ పనులను అనుమతులు ఇచ్చారు. రూ.26 కోట్లతో కాలువలను బాగు చేయడంతో మొదటి పంట సాఫీగా జరిగింది. జరిగిన పనులన్నింటినీ ఫోటోలు, వీడియోలు తీసి ప్రభుత్వానికి పంపారు. ఈ పనులకు సంబంధించిన బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయగా, అవి ఇంకా విడుదల కాలేదు. ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉన్నాయి. అయితే ఈ ఏడాది రెండో పంటకు గానూ ఏప్రిల్, మే నెలల్లో నియోజకవర్గానికి రూ.2 కోట్లు చొప్పున ఓఅండ్ఎం నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.20 కోట్లు మంజూరు కాగా అందులో రూ.10 కోట్ల మేర పనులను సాగునీటి సంఘాల ద్వారా పూర్తి చేశారు. ఈ బిల్లులను అప్‌లోడ్ చేయాలంటే వీటికి బడ్జెట్ లేదు. దీంతో ఈ బిల్లులన్నీ జిల్లా అధికారుల వద్ద పెండింగ్ ఉన్నాయి. కాగా కొన్ని కోర్టు కేసులకు సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.



డీఆర్సీలోనూ చర్చ

ఏడాది కాలంలో జరిగిన ఓఅండ్ఎం పనులన్నీ చాలా వరకూ కూటమి పార్టీల నేతలే చేశారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో వీరంతా ఆయా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో గత నెలలో జరిగిన డీఆర్సీ సమావేశంలో ఓఅండ్ఎం బిల్లుల పెండింగ్ అంశాన్ని ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. బిల్లులు ఇవ్వకపోతే పనులు చేసిన వారు నష్టపోతారని, ఆ ప్రభావం అంతిమంగా రైతులపై పడుతుందని ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే మరో మూడు వారాల్లో రెండో పంట వరి కోతలు పూర్తవుతాయి. ఆ తర్వాత కీలకమైన రబీ సీజన్ మొదలవుతుంది. అప్పుడు కాలువల్లో ఓఅండ్ఎం పనులు చేయాల్సి ఉంటుంది. చేసిన పనులకే బిల్లులు రాకుంటే ఉంటే, మళ్లీ పనులు చేసేందుకు ఎవరు ముందుకొస్తారన్న ఆందోళన అధికార వర్గాల్లోనూ కనిపిస్తోంది. అప్పుడు మళ్లీ పనులు చేయించేందుకు తంటాలు పడాల్సి ఉంటుందని వాపోతున్నారు.

ఆ మహిళకు సిఫార్సు లేఖ ఇవ్వలేదు!

- ఫొటో వేసినందుకు జగన్‌రెడ్డి రోత పత్రికకు థాంక్స్
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా తమ ముఖాలు మాత్రమే చూపించే జగన్‌రెడ్డి రోత పత్రికలో ఇప్పుడు తన ఫొటోను ప్రచురించినందుకు ఆ పత్రికకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి థాంక్స్ చెప్పారు. మండలంలోని ఎర్రగుంటలో జరిగిన ఓ కార్యక్రమానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. మీడియాలో వైరల్ అవుతున్న తన ఫొటోకు సంబంధించి మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు క్లారిటీ ఇచ్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన ఓ సంస్థ చైర్మన్ సిఫార్సుతో ఓ మహిళ తన వద్దకు వచ్చారన్నారు. తన కార్యాలయానికి వచ్చి రాగానే శాలువా కప్పి తన భర్త జైలులో ఉన్నాడని, పెరోల్ ఇచ్చేందుకు ప్రభుత్వానికి సిఫార్సు లేఖ ఇవ్వాలని కోరారని చెప్పారు. వేరే నియోజకవర్గానికి చెందినవారి విషయంలో తాను జోక్యం చేసుకోనని స్పష్టం చేసినట్లు సోమిరెడ్డి పేర్కొన్నారు. ఆ మహిళ వెళ్లిపోయాక జైళ్ల శాఖ అధికారికి ఫోన్ చేస్తే జైలులో ఉన్న వ్యక్తి నేరచరిత్ర మొత్తం వివరించారని, ఆ తర్వాత మరో మూడుసార్లు ఆ మహిళ తన కార్యాలయానికి వచ్చినా సిఫార్సు లేఖ ఇవ్వలేదన్నారు. తన కార్యాలయానికి పరిచయం లేని వ్యక్తులు కూడా వచ్చి మర్యాద పూర్వకంగా శాలువాలు కప్పి బొకేలు ఇచ్చి వెళ్తుంటారని, అదే క్రమంలో ఓ మహిళ తనకు శాలువా కప్పిన ఫొటోను జగన్‌రెడ్డి రోత పత్రికలో ప్రచురించడం చూశానన్నారు. ఈ సందర్భంగా జగన్‌రెడ్డి రోత పత్రికకు సోమిరెడ్డి థాంక్స్ చెప్పారు.

ప్రధానోపాధ్యాయుడికి ట్రైబల్ ఫొటో అవార్డు

- జాతీయస్థాయి పోటీలో సూర్యప్రకాశరావు ప్రతిభ

లింగసముద్రం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్-2025 అవార్డును మండలంలోని మొగిలిచెర్లలోని జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే.సూర్యప్రకాశరావు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ సహకారంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటో గ్రాఫిక్స్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వారు ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు పోటీలను జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న పోటీదారులు కేవలం గిరిజనులకు సంబంధించిన ఫొటోలను మాత్రమే ఆన్‌లైన్‌లో డిజిటల్ కాపీలను పంపించారు. సుమారు 700 నుంచి 800 మంది వరకు ఈ పోటీలో పాల్గొనగా దేశ వ్యాప్తంగా 12 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి సూర్యప్రకాశరావు విజేతగా నిలిశారు. ఈ అవార్డు, బంగారు పతకం, ప్రశంసాపత్రంను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, పాయ్ వైస్ చైర్మన్ డాక్టర్ కొంపల్లి సుందర్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజులు చేతుల మీదుగా అందుకున్నారు.



విజయవాడలో ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డును పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ నుంచి అందుకుంటున్న హెచ్‌ఎం సూర్యప్రకాశరావు

పర్యాటక శాఖ భవనాల పరిశీలన

ఉదయగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనకట్ట సమీపంలో ఉన్న పర్యాటకశాఖ భవనాలను మంగళవారం జిల్లా పర్యాటకశాఖ మేనేజర్ ఉషశ్రీ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడతూ పర్యాటక శాఖ భవనాలను ఇటీవల టెండర్ ద్వారా అద్దెప్రాతిపదికన నూతంగి తులసీరామ్‌కి అప్పగించామన్నారు. దీంతో ఆ భవనాల మరమ్మతులు ఏ మేరకు చేపట్టారో పరిశీలించేందుకు వచ్చామన్నారు. పనులు పూర్తయిన భవనాల్లో రెస్టారెంట్, అతిథిగృహం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9498
వెండి కిలో ధర	రూ. 116900
వెండి ఒక గ్రాము	రూ. 119.90



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

-డాక్టర్ సునీల్ శర్మ పీహెచ్‌సీ వైద్యులు

సీతారామపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ సునీల్‌శర్మ తెలిపారు. నీటిని నిల్వ ఉంచకూడదని, జ్వరం,విరోచనాలు వచ్చి తగ్గకుంటే వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతితో

? : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

! : నీటిని కాచి చల్లార్చి తాగడం వల్ల విష జ్వరాలు రాకుండా చూడవచ్చు. ఎక్కువగా మజ్జిగ,ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగడం వల్ల విరోచనాలను అరికట్టవచ్చు.

? : ప్రతివారం వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నారా .

! : స్పెషల్ డ్రైవ్,డీపీటీ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.ప్రస్తుతం దేవమ్మ చెరువు, పోలంగారిపల్లి గ్రామాల్లో చేపట్టాం.

? : ల్యాబ్ అసిస్టెంట్ ఉన్నారా. రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారా.

! : ఫార్మాసిస్టెంట్ లీవ్‌లో ఉన్నారు.ల్యాబ్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పై ఉన్నారు.గండిపాలెం నుంచి మంగళ,శుక్రవారాల్లో వచ్చి పరీక్షలు నిర్వహిస్తారు.

? : పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉందా.

! : స్టాఫ్ నర్స్ కొరత ఉంది.ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉన్నారు.

కంప చెట్ల మధ్య 'వసతి'

- ఊరికి దూరంగా
- సౌకర్యాలు లేకుండా హాస్టల్

ఆత్మకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ జంక్షన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ సమీకృత గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో మౌలిక వసతులు కొరవడ్డాయి.దీంతో ప్రతి ఏలా విద్యార్థులకు వెతలు తప్పడం లేదు. వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి వరకు చదివే 80 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వసతిగృహానికి ప్రహరీగోడ నిర్మాణం లేక రక్షణ కరువైంది. వసతిగృహం పరిసర ప్రాంతాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉంది.దీంతో విషపురుగుల బెడద విద్యార్థులను కలవరపరుస్తోంది. దానికి తోడు వసతిగృహం ఎదుట పెద్దగోతులలో నీరు నిల్వ ఉండి దోమలకు నిలయంగా ఉన్నాయి. ఈ వసతిగృహం పట్టణానికి దూరంగా ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహ సముదాయానికి ప్రహరీగోడ నిర్మించడంతో పాటు పరిసర ప్రాంతాలను చదును చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కంపచెట్ల మధ్య ఉన్న ప్రభుత్వ వసతిగృహం

వలస వాసులకు నిత్యావసరాల పంపిణీ



వలసవాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మన్సూర్‌అలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉదయగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వర్షం కారణంగా వ్యాపారం లేక చెట్లు, పైపుల కింద జీవనం సాగిస్తున్న వలస కుటుంబాలకు అప్పసముద్రం ఆరోగ్య కార్యకర్త ఎండీ మన్సూర్‌అలీ బియ్యం, నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'పైపులే నివాసాలు.. వర్షంతో వలస వాసుల కష్టాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన తనవంతు సాయంగా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. వలస వాసుల కష్టాలను మరికొంతమంది దృష్టికి తీసుకెళ్లి వారికి సహాయసహకారాలు అందించేలా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

యూరియా పంపిణీ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.కొండారెడ్డిపల్లి రైతుసేవా కేంద్రానికి మంగళవారం 14 టన్నుల యూరియాను ప్రభుత్వం సరఫరా చేసింది.దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వీఏఏ హరనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు బస్తా రూ. 270 చొప్పున తొలిరోజు 9 టన్నుల వరకు పంపిణీ చేశామన్నారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశామన్నారు. అలాగే తూర్పుబోయమడగల గ్రామానికి 100 బస్తాల యూరియాను సరఫరా చేశామని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు 336 బేళ్లను తీసుకొని రాగా, 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. వారు 182 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 154 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ.140గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ.రాజశేఖర్ తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఉదయగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈవో-1 తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌బీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని, వెనుకబడిన విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాదర్‌బాషా, ఉపాధ్యాయుడు నసీంఅక్తర్ పాల్గొన్నారు.

ఫీల్డ్ ఆఫీసర్ బదిలీ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ఏపీజీబీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జీ ఇంతియాజ్‌ను నెల్లూరులోని కిసాన్‌నగర్ బ్యాంకుకు బదిలీ చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. దీంతో మంగళవారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో దుత్తలూరు మండలం నందిపాడు బ్యాంకులో విధులు నిర్వర్తిస్తున్న నవ్యకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం నిర్వాహకులు మండలంలోని విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 21న బహుమతులు పంపిణీ చేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. వేడుకల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

ఆత్మకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహిమలూరులో ఆత్మ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(జిల్లా వనరుల కేంద్రం)ఆధ్వర్యంలో మంగళవారం పంటలపై తెగుళ్లు, చీడపీడల నివారణపై రైతలకు అవగాహహన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో ఆశిస్తున్న పురుగు,తెగుళ్లు వాటి నివారణ పద్ధతులను గురించి వివరించారు. మండల వ్యవసాయశాఖాధికారి కే. కిషోర్‌బాబు మాట్లాడుతూ అన్నదాత - సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఈనెల 20 లోపు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తడాక్టర్ శివజ్యోతి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ, ఏడీఏ మారుతీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పంటల సస్యరక్షణపై అవగాహన

సంగం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాళెం రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి శశిధర్ ఆధ్వర్యంలో ఆత్మ వారి సౌజన్యంతో పంటల సస్య రక్షణ పద్ధతులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి, వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో ఆత్మ ఏడీఏ అనిత, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త వినీత, కేవీకే శాస్త్రవేత్త శివజ్యోతి, డీఆర్‌సీ ఏడీఏ మారుతీదేవి, సురేఖదేవి, మధు సూదన్ రైతులకు వరి, వేరుశనగ సాగులో సస్య రక్షణ చర్యలు వివరించారు.

అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఆత్మకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారకభవన్‌లో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ)ఆత్మకూరు ప్రాజెక్ట్ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ అంగన్‌వాడీల్లో రకరకాల యాప్స్‌ను రద్దు చేయాలని, చిన్నారులకు ఇచ్చే కూరగాయలు, సరుకుల ధరలను పెంచాలని కోరారు. అనంతరం 17 మందితో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా జీవీ శివప్రసాద్, ప్రాజెక్ట్ కార్యదర్శిగా పీ. రాధ, అధ్యక్షురాలుగా కే. రమణమ్మ, కార్యదర్శిగా సీహెచ్ రూతమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయభారతి, వర్కింగ్ సెక్రటరీగా షేక్ జమీల, ప్రచార కార్యదర్శిగా నాగరత్నమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కే. హజరత్తయ్య, మండల అధ్యక్షుడు ఏ. నాగయ్య, ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుజాతమ్మ

వైభవంగా ఆంజనేయుడికి ఆకుపూజ

ఆత్మకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హనుమాన్‌జంక్షన్‌లో వెలసి ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం కనులపండువగా పత్రపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, సహస్రనామార్చన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు.

గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ

వింజమూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు రైతు సేవా కేంద్రాల్లో ఉంటూ రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగులో సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడీ శ్రీసరోజిని, కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ సహాయకులు శేషగిరిరావు, నాలుగు మండలాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా ఉక్కాల



సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడ్‌హౌస్‌పేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు ఉక్కాల శ్రీనివాసులు ఆత్మకూరు ఏఎంసీ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఆయన గతంలో సంగం మండల ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఏఎంసీ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం డాక్టర్ విజం దొరసానమ్మ ట్రస్ట్ అధినేత, ఎస్‌వీపీ ప్రజా వైద్యశాల ఎండీ డాక్టర్ ప్రణీత్ ఆర్థిక సాయం అందజేశారు. నువ్వూరుపాడుకి చెందిన పందిపాటి నందిని, పందిపాటి చక్రధర్‌లకు విద్యా ప్రోత్సాహకం కింద రూ. 15వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది డాక్టర్ వెంకటసందీప్, డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, దొడ్ల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

ఉదయగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా విద్యార్థులకు వేస్తున్న వ్యాక్సిన్‌ను మంగళవారం గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేకడ్రైవ్‌లో భాగంగా 5-7 ఏళ్లలోపు చిన్నారులకు డీపీటీ, 10, 16 ఏళ్ల వారికి డీటీ వ్యాక్సిన్‌లు వేస్తున్నామన్నారు. ఆయా వయసుల వారు తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్‌డీవో

అనంతసాగరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికంభంపాడు గిరిజన కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని ఆత్మకూరు ఆర్డీవో పావని తెలిపారు. మౌలిక వసతులు కరువై ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల కాలనీ వాసులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె మంగళవారం కాలనీని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, ఇళ్లు లేని వారికి ఇళ్ల మంజూరు చేయిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జయవర్ధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శి దంపతులకు సీఎం సన్మానం

సంగం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరుకి చెందిన ఎన్‌ఆర్‌ఐ చదలవాడ హరీష్ కుమార్, మృదుల దంపతులను సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం సత్కరించారు. పీ 4 పథకంలో ఆత్మకూరు మండలం మహిమలూరులో ఓకుటుంబాన్ని దత్తత తీసుకుని హరీష్‌కుమార్ దంపతులు సహాయసహకారాలు అందచేశారు. ఈ నేపథ్యంలో అమరావతిలో జరిగిన సమావేశంలో వారిని సీఎం శాలువాతో సత్కరించి అభినందించారు.



హరీష్‌కుమార్, మృదుల దంపతులను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి

ఉదయగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని లింగంనేనిపల్లి గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అన్నీ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రద్దు, రైతులకు యూరియా సరఫరా చేయకపోతే దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



లింగంనేనిపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

పీహెచ్‌సీ నిర్వహణ తీరుపై అసంతృప్తి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని మంగళవారం కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు పరిశీలించిన ఆమె నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వహించడం లేదని వైద్యాధికారిణి ఆయేషాపై మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ తీరు మార్చుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వ్యాక్సినేషన్ నిల్వ డబ్బాలు, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు ఎం శ్రీనివాస్, సీహెచ్ రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ సువార్త, సూపర్‌వైజర్ వెంకటయ్య, ఏఎన్ఎం జానకి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఐరిష్

- కొత్త విధివిధానాలు ప్రకటించిన కేంద్రం
- అమలుపై అధికారులకు శిక్షణ
- అక్రమాలకు చెక్‌పడేనా?



మర్రిపాడు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు (ఫైల్)

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాలకు పని కల్పించేందుకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో అక్రమాలు, అవినీతికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధి విధానాలను రూపొందించింది. ఈ పథకం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. పని దొరకని కుటుంబాలకు ఏడాదిలో 100 రోజులు పని కల్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా దీనిని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా జిల్లాలో ఏడాదికి రూ.300 కోట్లకుపైగా నిధులతో పేదలకు ఉపాధి కల్పిస్తోంది. జిల్లాలో 3.66 లక్షల మందికి జాబ్ కార్డులను ప్రభుత్వం అందించింది. అయితే వారిలో 2.68 లక్షల మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. తద్వారా రోజుకు రూ.150 నుంచి రూ.200 వరకు వేతనం పొందుతున్నారు. అయితే ఈ పథకంలో కొందరు పాలకులు, అధికారులు, సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు.

● అక్రమాలు ఇలా...

అర్హత కలిగిన పేదలకే జాబ్ కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఉపాధి హామీ సిబ్బంది, ఉద్యోగులు కుమ్మక్కై బినామీ పేర్లతో జాబ్ కార్డులను భారీగా సృష్టించుకుని నిధులు కాజేస్తున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానంలో ఉపాధి పనులకు హాజరైన వారి గ్రూప్ ఫొటోలు తీసి యాప్‌లో పొందుపరుస్తున్నారు. అయితే జాబ్ కార్డు కలిగిన వ్యక్తి పని చేయక పోయినా ఫొటో తీసే సమయానికి హాజరవడం గానీ, బయటి వ్యక్తులను వారి స్థానంలో పెట్టి ఫొటోలు తీసి యాప్‌లో పొందుపరచడంగానీ చేస్తున్నారు. తద్వారా ఎక్కువ మంది పనులకు హాజరైనట్లు చూపుతూ నిధులను మింగేస్తున్నారు.

● కొత్త నిబంధనలతో కట్టడి చేసేనా?

బినామీ జాబ్ కార్డుల వ్యవహారం బయటపడుతుండటంతో దీనిని ఆరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. ఉపాధి పనులకు హాజరయ్యే ప్రతీ ఒక్కరికి నుంచి ఐరిష్ (కనుపాప) ఫొటో తీయాలని నిర్ణయించింది. నాలుగు గంటల వ్యవధిలో రెండు సార్లు ఉపాధి కూలీల కళ్ల ఫొటోలు తీసి ఆ యాప్‌లో పొందుపరిచేలా విధి విధానాలను రూపొందించింది. అలాగే పనుల పర్యవేక్షణను కేవలం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవోలే కాకుండా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఏపీడీలు కూడా పర్యవేక్షించేలా విధి విధానాలను రూపొందించింది. దీనికి సంబంధించి శిక్షణ తరగతులను అధికారులు దాదాపుగా పూర్తి చేశారు. త్వరలో కొత్త విధానాలు అమలు కాబోతున్నాయి. కొత్త పద్ధతిలో అయినా అవినీతి, అక్రమాలను అరికట్టి అర్హులైన నిరుపేదలకే ఉపాధి కల్పించాలని అందరూ భావిస్తున్నారు.

మహిళ మృతదేహానికి పోస్టుమార్టం

కావలిరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామ సమీపంలో జామాయిల్ తోటలో గుర్తించిన కుళ్లిపోయిన గుర్తు తెలియని మహిళ మృతదేహానికి మంగళవారం నెల్లూరు ఫోరెన్సిక్ వైద్యుడు సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఆ మహిళ వయస్సు 60 నుంచి 65 ఏళ్లు ఉండవచ్చని వైద్యుడు నిర్ధారించారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐ బాజిబాబు పర్యవేక్షణలో ఈ పోస్టుమార్టం జరిగింది.

18 మద్యం సీసాల స్వాధీనం

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవరం గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణంపై ఉదయగిరి ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్ మంగళవారం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 18 మద్యం సీసాలతోపాటు నిర్వాహకుడు మధును అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

పంచాయతీ భవనం కూల్చివేతపై విచారణ

కావలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలంచర్లలో పాడుబడిన పంచాయతీ భవనం కొంతభాగం తొలగింపుపై కలెక్టర్ ఆనంద్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో మంగళవారం ఎంపీడీవో శ్రీదేవి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ భవనం కూల్చివేతపై గ్రామానికి చెందిన తల్లిబోయిన సురేష్ ఈనెల 11వ తేదీ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని దానిపై గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టామన్నారు. గ్రామసభ పెట్టి ఆస్థలం తీసుకుని ఉంటే మాకు ఎలాంటి అభ్యంతరం ఉండేది కాదని, టీడీపీ నాయకులు తమ ఇష్టానుసారం తొలగించారని ఫిర్యాదుదారుడు తెలిపాడు. స్థానిక టీడీపీ నాయకులు మాత్రం 4నెలల క్రితం పంచాయతీరాజ్ ఏఈ ఈ భవనాన్ని పరిశీలించి నివాసయోగ్యమైనది కాదని, తొలగించవచ్చని సర్టిఫికెట్ ఇవ్వడంతో పంచాయతీ తీర్మానం పెట్టి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రాములవారి గుడి అవసరాల కోసం కొంత భాగాన్ని తొలగింపునకు గ్రామానికి చెందిన 150 మంది సంతకాలతో సచివాలయంలో అర్జీ కూడా ఇచ్చామని తెలిపారు. ఎమ్పీడీవో శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలు తొలగింపు పంచాయతీ తీర్మానంతోపాటు అధికారుల అనుమతి ఉండాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కార్యదర్శి శ్యామ్‌ను ఆదేశించారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, వైసీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సుందరయ్య కాలనీ బీ బ్లాకులో నివసిస్తున్న సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ చిరంజీవి ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు సమాచారం మేరకు... చిరంజీవి 24-1 సచివాలయంలో పనిచేస్తున్నారు. ఈ నెల 6వ తేదీ తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ఆయన ఇంట్లోకి ప్రవేశించి నాలుగు గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు, మూడు ఫోన్లు దోచుకెళ్లాడు. దీనిపై బాధితుడు ఆలస్యంగా మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ సరుకులు ఇంటికి తరలింపు

పొదలకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సరుకులను ఆటోలో ఇంటికి తరలిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తను స్థానికులు అడ్డగించి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని తోకంచి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం నుంచి అంగన్‌వాడీ కార్యకర్త బాలామృతం, కోడిగుడ్లు, రాగిపిండి, ఖర్జూరం ఆటోలో తరలిస్తుండగా స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తను వివరణ కోరగా తాను స్కూల్లో సరుకులు ఉంచుకునే అవకాశం లేకపోవడంతో ఆటోలో లబ్ధిదారులకు ఇచ్చేందుకు తీసుకెళ్తుండగా వారు అడ్డగించినట్లు తెలిపారు.



ఆటోలో ఉన్న అంగన్‌వాడీ సరుకులు

ఉదయగిరిలో ఈదురుగాలుల బీభత్సం

ఉదయగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వారం రోజులుగా ఈదురుగాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. అర్ధరాత్రి నుంచి ఉదయం 11 గంటల వరకు గాలులు బలంగా వీస్తుండడంతో ప్రజలు బేజారవుతున్నారు. ఈదురు గాలుల దాటికి మంగళవారం పట్టణంలోని స్టేట్‌పేటలో విద్యుత్ తీగ తెగిపడడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. అలాగే హోర్డింగ్‌లు, చెట్ల కొమ్మలు నేలకొరుగుతున్నాయి. గాలుల దాటికి ఏ సమయంలో ఏలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



ఈదురుగాలులకు తెగిన విద్యుత్ తీగలు, నేలకూలిన హోర్డింగ్

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ఎంపీపీ

అనంతసాగరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ సంపూర్ణమ్మ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణకు చర్యలు చేపట్టాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ ఉద్యోగులు త్వరగా పీ4 సర్వేను పూర్తి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి, అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 520

వర్షానికి పగిలిన విద్యుత్ లైన్ ఇన్సులేటర్లు

లింగసముద్రం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు లింగసముద్రం-1 సచివాలయం సమీపంలోని పొలాల్లో గల 33/11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సంబంధించిన ఇన్సులేటర్లు పగిలిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇన్సులేటర్లు రెండు పగిలి పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో విషయం తెలిసిన వెంటనే మండల ఏఈ షేక్ ఫిరోజ్ సిబ్బందితో యుద్ధప్రాతిపదికన కదిలి సమస్య ఎక్కడ వచ్చిందో గుర్తించి, సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి ఇన్సులేటర్లు బిగించి సాయంత్రం 6.30 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

న్యూస్ బాక్స్

సబ్ కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కలెక్టరుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దామెర హిమ వంశీని మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్ కలెక్టరును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలోని పలు విషయాలపైన. కరేడు భూసేకరణ తదితర అంశాలపై ఎమ్మెల్యే సబ్ కలెక్టరుతో చర్చించారు.

48 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా

లింగసముద్రం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు-రేళ్లపాడు భారీ మంచినటి పథకం నుంచి మంచినీటి సరఫరా నిలిచిపోయింది. మంగళవారం తెల్లవారుజామున ఈ మంచినీటి పథకానికి చెందిన విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో ఈ పథకం నుంచి సుమారు 48 గ్రామాలకు నీటి సరఫరా నిలిచి పోయింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని నీటి సరఫరాను పునర్దురించాలని ప్రజలు కోరుతున్నారు.

రథం నిర్మాణానికి నేడు పూజలు

ఉలవపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులో వెలసియున్న వేణుగోపాల స్వామి ఆలయ నూతన రథం నిర్మాణానికి బుధవారం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వీ.శ్రీనివాస్ మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు.

అంగన్‌వాడీలకు ఒకే యాప్ పెట్టాలి

కావలి(టౌన్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలకు ప్రస్తుతం ఉన్న యాప్ లన్నింటిని రద్దు చేసి ఒకే యాప్ విధానం తీసుకురావాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహానాబేగం డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన అంగన్వాడీల 5వ మహాసభలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పనికి రాని ఫోన్ల స్థానంలో 5జీ కొత్త ఫోన్లను ఇవ్వాలని కోరారు. ఈనెల 23న నెల్లూరులో జరిగే అంగన్వాడీల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయంతి కుమారి, గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, రుక్మిణి, సుభాషిణి, విజయలత తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు అందుకున్న లబ్ధిదారులు అప్పీల్ చేసుకోండి

కొండాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పింఛన్ రద్దు, మార్పు కోసం నోటీసులు అందుకున్నలబ్ధిదారులు అప్పీల్ చేసుకునేందుకు వెసులుబాటు ఉందని ఇన్‌చార్జి ఎంపీడీవో శేషసాయి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 250 మందికి నోటీసులు ఇచ్చారన్నారు. నోటీసులు అందుకున్న వారు నోటీసుతోపాటు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్లు (పాతవి, కొత్తవి) అలాగే వైద్యశాలలో చికిత్స పొందిన, పొందుతున్న సర్టిఫికెట్లు ఎంపీడీవో కార్యాలయంలో అందచేస్తే ఎంపీడీవో లాగిన్ నుంచి మరోసారి నోటీసులు అందజేస్తారన్నారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి నిర్దేశిత తేదీతో ఈ నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు సూచించిన వైద్యశాలకు మరోసారి పునఃపరిశీలకు వెళ్లాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

నేడు చేవూరులో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

గుడ్లూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా నిర్మాణం జరుగుతున్న ఇండోసోలార్ కంపెనీ ప్రాంతాన్ని కలెక్టర్ ఓ. ఆనంద్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమ వంశీ బుధవారం పర్యటిస్తారని ఇండోసోలార్ పీఆర్‌వో లక్ష్మీనాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇండోసోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా స్థానిక యువతకు, ప్రాజెక్టుకు భూములు సమకూర్చిన వారికి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చిన కుంటేబాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

కల్లయ్య మృతికి టీడీపీ నేతల సంతాపం

కలిగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కలిగిరి పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఇంగ్లే కల్లయ్య(72) మంగళవారం అకాలమరణం చెందాడు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, పలువురు నాయకులు కల్లయ్య భౌతికకాయంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊసా మాల్యాద్రి, పుల్లా కామేశ్వరరావు, చల్లా వెంకటేష్, బైరిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుల అడ్డా.. 'బస్టాండ్'!

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల కబ్జా
- ఆక్రమిస్తాం.. అద్దెలకిస్తాం.. అడ్డొచ్చేదెవరు?
- పంచాయతీ ఆదాయానికి గండి
- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రోడ్లు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వలేటివారిపాలెం ప్రధాన బస్టాండ్ ప్రాంతం

వలేటివారిపాలెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వలేటివారిపాలెం బ స్టాండు ప్రాంతం అక్రమార్కులకు అడ్డాగా మారింది. ఈ సెంటర్లో ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రైవేట్ స్థలాల యజమానులు చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి రేకుల షెడ్లు వేసి దుకాణదారులకు అద్దెకిస్తున్నారు. సర్కారు స్థలాలు కబ్జా చేసి అద్దెల రూపంలో రూ.లక్షల సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. బ స్టాండు సెంటర్లో రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడ సెంటు భూమి రూ.10 లక్షలకు పైగానే ధర ఉంది. ఎకరా దాదాపు రూ.10 కోట్లకు పైమాటే. రోడ్డుకు రెండు వైపులా సుమారు 5 ఎకరాలకు పైగానే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. వీటి విలువ రూ.50 కోట్లకు పైనే ఉంటుంది. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను సుమారు వంద మందికి పైగానే దుకాణదారులు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు.

● ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రోడ్లు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి రేకులషెడ్లు వేసి దుకాణదారులకు అద్దెలకివ్వడంతో రోడ్లు ఆక్రమణలతో కుంచించుకపోతున్నాయి. దీంతో వివిధ పనులపై వచ్చే వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసే స్థలం లేక రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. అంతేగాకుండా దుకాణదారులు తమ దుకాణాలు ముందు ఎత్తు పెంచుకునేందుకు మట్టి తోలుకుంటున్నారు. దీంతో వర్షం నీరు పోయే అవకాశం లేక రోడ్లపైనే నిలబడుతున్నాయి. దీంతో బస్టాండు సెంటరు బురదబురదగా మారుతొంది. ప్రయాణీకులు బస్సుల కోసం ఆ బురదలోనే నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది.

● ట్రాఫిక్‌కు అంతరాయం...

రోడ్లు ఆక్రమణకు గురవడంతో నిత్యం ట్రాపిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండు సెంటరు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఈ ప్రాంతీయులు హైదరాబాద్, చెన్నై, విజయవాడ, బెంగళూరు తదితర పట్టణాలకు వెళ్లాలంటే వలేటివారిపాలెం బస్టాండు సెంటరుకు వెళ్లి బస్సులు ఎక్కాల్సిందే. అంతేగాకుండా ప్రతి శనివారం మాలకొండ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులతో బస్టాండు సెంటరు కిటకిటలాడుతోంది. వ్యవసాయ పనుల సీజన్లో కూడా బస్టాండు సెంటరు రద్దీగా ఉంటుంది. దీంతో ప్రయాణికులకు నిరంతరం ట్రాపిక్ ఇక్కట్లు తప్పడంలేదు.

● పంచాయతీ ఆదాయానికి గండి..

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణదారులు పంచాయతీకి పైసా కూడా చెల్లించడంలేదు. దీంతో పంచాయతీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. స్థలాలు ఆక్రమించి, వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణదారుల నుంచి పంచాయతీ అధికారులు రుసుం వసూలు చేయవచ్చు. రుసుం చెల్లించని వాళ్లకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వ స్థలాల్లోని దుకాణాలను తొలగించే అధికారం పంచాయతీకి ఉంది. అయితే ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఒక్కో దుకాణదారు నుంచి రోజుకు రూ.10ల చొప్పున నెలకు రూ.3 వందలు రుసుం వసూలు చేయవచ్చు. అలా వంద దుకాణదారుల నుంచి నెలకు రూ.30 వేలు చొప్పున ఏడాదికి రూ.3లక్షల 60 వేలు రుసుం వసూలు అవుతోంది. ఈ ఆదాయాన్ని పంచాయతీలో అభివృద్ధి పనులకు వినియోగించవచ్చు. కానీ ఆ దిశగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు.

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

బస్టాండు సెంటరులో కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా పంచాయతీ ఆదాయానికి గండిపడుతోంది. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులుతోపాటు ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, పంచాయతీకి ఆదాయాన్ని చేకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.

సామూహిక మంగళగౌరీ వ్రతం

కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దబజారులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా మంగళగౌరీ వ్రతం నిర్వహించారు. ఆలయ పూజారి రాజాస్వామి అమ్మవారిని కనుల పండువగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన మంగళగౌరీవ్రతంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కోట వెంకటనరసింహం, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలి

బిట్రగుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులు పంటకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాని పెంచాలని జిల్లా ఆత్మ పీడీ మురళి అన్నారు. బోగోలు మండలం తాళ్లూరులో ఏవో శైలజ ఆధ్వర్యంలో మంగళవారం రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మ పీడీతో పాటు కావలి ఏడీఏ నాగరాజు పాల్గొన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. అలాగే యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, వాడకం వలన కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఏవో పౌలు, వీఏఏ ప్రతాప్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హత్యకు మాజీ ఎమ్మెల్యే కుట్ర

● టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల ఆందోళన



కావలి బ్రిడ్జి సెంటర్‌లో ఆందోళన చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

కావలి/అల్లూరు/బిట్రగుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని హత్య చేసేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుట్రపన్ని పథకం రూపొందించారని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ మంగళవారం సాయంత్రం కావలి బ్రిడ్జి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదురుగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రతాప్‌రెడ్డికి, వైసీపీ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అలాగే అల్లూరులో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలదంకి మండలం అన్నవరంలో ఎమ్మెల్యేకి సంబంధించిన గురురాఘవేంద్ర మెటల్ క్వారీలో ఎమ్మెల్యేను హత్య చేయాలనే ఉద్దేశంతో మారణాయుధాలు, డ్రోన్‌తో కొందరు క్వారీ వద్దకు చేరుకున్నారన్నారు. క్వారీ వ్యూ, అక్కడ ఆయన కార్యాలయం ఆయన ఎలా వచ్చి ఎలా వెళ్లతారో తదితరాలు తెలుసుకునేందుకు డ్రోన్‌తో చిత్రీకరించటంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వారిలో ఇద్దరిని పట్టుకోగా వారి వద్ద కత్తి ఉందన్నారు. దీంతో ఎమ్మెల్యే అక్కడకు వస్తే ఆయనను హత్యచేయాలనే ఉద్దేశ్యంతోనే వెళ్లారని వారు ఆరోపించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, జనసేన నేత సిద్దూ తదితరులు ఉన్నారు.

● అల్లూరు మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిపై మండిపడ్డారు. అల్లూరు ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి టీడీపీ కార్యాలయం నుంచి పాతబస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, ఎందేటి హరికృష్ణ, బీజేపీ ప్రతినిధులు కత్తుల కిరణ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● బోగోలు టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎల్.సుధీర్‌బాబు, కే.వెంకటేశ్వరరెడ్డి, బీ.ప్రభాకర్, ఏ.ఆదిశేషయ్య, వీ.మహేష్‌రెడ్డి, జీ.సంజయ్, ఫిలిప్, రఫీ, ఎస్‌ఎస్ యాదవ్, బీజేపీ జిల్లా నేత ఎన్ఎస్‌యాదవ్, మండల కన్వీనర్ వీ.శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు



బిట్రగుంట : వెలుపోడు కూడలిలో టీడీపీ నేతలతో కలసి నిరసన తెలుపుతున్న పమిడి రవికుమార్ చౌదరి

● దగదర్తి మండలం వెలుపోడు కూడల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నీచమైన రాజకీయాలను ప్రజలు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఏ.హనుమంతరావు, నేతలు జీ.హరికిశోర్‌రెడ్డి, వీ.కొండపునాయుడు, మురళీమోహన్, వడ్డేవినయ్‌కుమార్, కే.సురేష్, పులిశీనయ్య, టీ.సుధాకర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలి

● కందకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రజా (కూటమి) ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి అండగా నిలబడాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని కరేడులో తారురోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే యుద్ధప్రాతిపదికన గుంతలు లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. అందులో భాగంగా కరేడు ర్యాంపు నుంచి చేవూరు వరకు రూ.2.45 కోట్ల నాబార్డు నిధులతో తారురోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. లింగసముద్రం మండలం చీమలపెంట రోడ్డుకు కూడా మరో రూ.5 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గంలోని ఏ మండలంలో కూడా గుంతలు పడిన రోడ్లుకు గంపడు మట్టి వేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నారని, మరోవైపు రాష్ట్రాభివృద్ధికి దోహదపడే పరిశ్రలు, ఐటీ రంగంపై దృష్టి సారించారన్నారు. అనంతరం కార్యకర్తలు, ప్రజల నుంచి వితనతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ అధికారులు, టీడీపీ నాయకులు రాచగల్లు సుబ్బారావు, నేలటూరి ఆదాము, పోలుబోయిన శ్రీనివాసులు, మెట్టా శ్రీనివాసుల రెడ్డి, జెట్టి సుబ్బరామిరెడ్డి, బాలమురళి, వాయిల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

కావలి(టౌన్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర ఆరోపించారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదాలపై విద్యార్థి సంఘాలు చేసిన పోరాటాలకు టీడీపీ, బీజేపీ, జనసేన మద్దతు పలికాయని, తమ ప్రభుత్వ వస్తే విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరిస్తామన్న హామీ విస్మరించడమేకాక మరింత దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22న చలో కలెక్టరేట్ కార్యక్రమం తలపెట్టామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి 15నెలలు పూర్తయినప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గు చేటన్నారు. జీవో 77ను రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్‌తో ప్రభుత్వం దిగిరాకపోతే ఉద్యమ కార్యచరణ రూపొందించి రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు అభిలాష్, సభ్యులు వెంకటబాలు, రాహుల్, జయంత్, వినీల్ తదితరులు పాల్గొన్నారు.

'వయ్యారి భామ' నిర్మూలనపై అవగాహన



కలుపు మొక్కల నిర్మూలనపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న కేవీకే డైరెక్టర్ ప్రసాద్‌బాబు, శాస్త్రవేత్తలు


కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వయ్యారి భామ కలుపు మొక్కలు (పార్థీనియం) నిర్మూలనపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక కృషి విజ్ఞానకేంద్రం (కేవీకే) డైరెక్టర్ ప్రసాద్‌బాబు కోరారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కేవీకే ఆధ్వర్యంలో వయ్యా రిభామ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కలుపు మొక్కల తీవ్రత, వ్యాప్తి గురించి ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో వయ్యారిభామ కారణంగా పంట ఉత్పత్తుల దిగుబడిపై 30 శాతం వరకు ప్రభావం పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ కలుపు మొక్కలను సమూలంగా నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో ఉన్న పార్థీనియం కలుపు మొక్కలను తొలగించా రు. తొలగించిన మొక్కలను ఒకచోట చేర్చి తగులబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, వృక్షశాస్త్ర విభాగం ఇన్‌చార్జి ఎస్.తిరుపతి స్వామి, అధ్యాపకులు ఐ.అనూష, పీ.రాజగోపాలబాబు, ఎం.బాలునాయక్, కె.కరుణరత్నకుమార్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతూ ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో కేవీ శేషారెడ్డి సూచించారు. అంకభూపాలపురంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సజ్జ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు** : వేరుశనగ పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో విజయ్‌కుమార్ తెలిపారు కరేడులోని రైతు సేవా కేంద్రాలు 1, 3 పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వేరుశన పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్, వీహెచ్ఏ మసూద్‌బాషా పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 20 ఆగస్టు 2025



తిరుపతిలో స్పిరిచ్యువల్ స్ట్రీట్



- ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఒక వీధి ఏర్పాటు ఆలోచనలో కార్పొరేషన్
- ఇస్కాన్, అలిపిరి, కపిలతీర్థం రోడ్లలో ఒకటి ఎంపికచేసే అవకాశం

ప్రసిద్ధ ఆలయాలకు నాలుగు వైపులా ఉండే రోడ్లను మాడవీధులు అంటారు. వీటిని పవిత్రమైన ప్రదేశాలుగా భావిస్తారు. ఆలయాల క్షేత్రమైన తిరుపతి నగరం మొత్తం పవిత్రమైనదే! అందుకే తిరుపతి నగరంలో స్పిరిచ్యువల్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేసే దిశగా నగర పాలకసంస్థ అధికారులు ఆలోచిస్తున్నారు. దాదాపు లక్ష మంది దాకా రోజూ తిరుపతి నగరంలోకి వస్తుంటారు. వీరు ఈ రోడ్డులోకి అడుగు పెట్టగానే ఒక ఆధ్యాత్మిక దివ్యానుభూతికి లోనయ్యేలా ఉండాలన్నది ఉద్దేశ్యం. పర్యాటకంగానూ ఇది లాభదాయకంగా ఉంటుందని భావిస్తున్నారు. కమిషనర్ మౌర్య ఈ ఆలోచనకు ఆచరణ రూపం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌ను నగరంలో ఎక్కడ ఏర్పాటు చేయాలన్న చర్చ నడిచినట్లు తెలిసింది. గాంధీరోడ్డు, గోవిందరాజుల ఆలయప్రాంతం, బస్టాండు, రైల్వేస్టేషన్ వంటి చోట్ల ఇటువంటి ఏర్పాటు సాధ్యం కాదని అనుకుంటున్నారు. తిరుమలకు వెళ్లే యాత్రికులకు కూడా ఉపయోగపడేలా ఉండాలన్నది ఆలోచన. ఇందుకోసం ఇస్కాన్‌రోడ్డు, కపిలతీర్థం, అలిపిరి ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

డివైన్ వాక్

స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లోకి ప్రవేశించగానే మనసుకు ప్రశాంతత చేకూరాలి. ఆధ్యాత్మిక అనుభూతి కలగాలి. ట్రాఫిక్ గందరగోళం, హారన్లు, అరుపులు ఉండవు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లో వేదమంత్రాలు, భజనలు, కీర్తనలు, నాదస్వరం మంద్రస్వరంలో వినిపిస్తాయి. సంప్రదాయ దేవాలయ శైలిలోనే లైటింగ్ కూడా ఉంటుంది. దుకాణాలు కూడా ఇదే పద్ధతిలో ఉంటాయి. ఈ వీధిలో ఏవి పడితే అవి విక్రయించరు. తులసి మాలలు, ధూపదీపాలు, పుస్తకాలు, ఆధ్యాత్మిక కళాఖండాలు అమ్మే షాపులు ఉంటాయి. భక్తులకు ప్రసాదాలు, ఆయుర్వేద వస్తువులు, దేవతా మూర్తుల చిత్రపటాలు, హస్తకళా వస్తువులు పూజా సామగ్రి లభిస్తాయి. టీటీడీ సౌజన్యంతో వారంలో ఒకరోజు, లేదా ప్రతి నిత్యం తిరుమల సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లో వాహనాలను అనుమతించరు. కేవలం నడక మాత్రమే ఉంటుంది. నడవలేని స్థితిలో ఉండేవారి కోసం బ్యాటరీ వాహనాలుంటాయి. స్పిరిచ్యువల్ స్ట్రీట్ ఎంపికలో ఇదే పెద్ద సవాలుగా మారుతుంది. వాహనాలను అనుమతి లేదంటే ఆ ప్రాంతపు ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలి. ప్రజాప్రతినిధుల సహకారంతో దీనిని సాకారం చేసుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వచ్చేనెల 1 నుంచీ కూర్చుని తాగండి బాబూ!

- మందుబాబుల కోసం జిల్లాలో 250 మద్యం షాపులకు పర్మిట్ రూములు
- ఏడాదికి రూ.16.82 కోట్ల ఆదాయం



పాపం.. మందుబాబులు అందరూ బార్లకు వెళ్లి తాగలేరు కదా! కొందరు షాపుల్లో సీసాలు కొనుక్కుని అక్కడే నిలబడి గుటుక్కున గొంతులో పోసేసుకుంటుంటారు. మరికొందరు ఏ సందుగొందుల్లోనో చాటుకు చేరి గబగబా లాగించేస్తుంటారు. కాస్త నిమ్మళంగా తాగాలనుకునేవాళ్లకి ఊరిచివర పాడుబడిన భవనాలూ, ముళ్లకంపలే దిక్కు. ఈ కష్టం చూడలేక ప్రభుత్వం తాజాగా పర్మిట్ రూములకు అనుమతులు ప్రకటించింది. పైకి ఎన్ని మాటలు చెప్పినా.. ప్రభుత్వ ఆదాయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచేది వీరే కదా మరి! ఏ ప్రభుత్వానికైనా ప్రియమైనవారు వీరే. ఇక వీరికి షాపుల దగ్గర నిలబడి తాగే అవసరం ఉండదు. సెప్టెంబరు 1 నుంచీ దర్జాగా కూర్చుని మందు లాగించవచ్చు. జిల్లాలో 250 మద్యం షాపులున్నాయి. వీరంతా ఇక పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకోవచ్చు. కాకపోతే ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించాలి. అమ్మకాలను బట్టీ షాపులకు రెండు రకాల శ్లాబులు నిర్ణయించారు. ఏడాదికి రూ.55 లక్షల లోపు మద్యం అమ్మేవాళ్లు రూ.5 లక్షలు ఏడాదికి చెల్లించాలి. ఈ శ్లాబు కింద 55 షాపులున్నాయి. ఇక రూ.65 లక్షలు దాకా అమ్ముతుంటే రూ.7.50 లక్షలు నిర్ణయించారు. ఈ శ్లాబులో జిల్లాలో 173 షాపులున్నాయి. ప్రస్తుతం సెప్టెంబరు, అక్టోబరు నెలలకు మాత్రమే పర్మిట్ రూములకు రుసుము నిర్ణయించారు. ఆ తర్వాత ఏడాదికి వసూలు చేస్తారు. రెండు నెలల కాలానికే ప్రభుత్వానికి రూ.2.80 కోట్లు ఆదాయం సమకూరనుంది. ఏడాదికి 16.82 కోట్లు వస్తుందని అంచనా. ఇక పర్మిట్ రూము తాగడానికే పరిమితం. ఇక్కడ వంట పదార్ధాలు తయారు చేయడానికి లేదు. షాపు వేళల్లోనే వీటినీ తెరవాలి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



మూడో రోజు.. మహిళా ప్రయాణికుల రెట్టింపు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన మూడో రోజైన సోమవారం.. జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల సంఖ్య రెట్టింపైంది. అంతకుముందు సగటును రోజుకు 35వేల నుంచి 40వేల మంది మాత్రమే ప్రయాణించేవారని ఆర్టీసీ గణాంకాలు చెబుతున్నాయి. ఉచిత ప్రయాణం విస్తృతంగా ప్రజల్లోకి చేరడంతో సోమవారం నాడు 24గంటల్లో జిల్లా వ్యాప్తంగా మహిళలు 81,350మంది, బాలికలు 915మంది రాకపోకలు సాగించారు. దీంతో మూడో రోజునే రెట్టింపు సంఖ్యలో ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోనే అధికసంఖ్యలో మహిళలు స్త్రీ శక్తి పథకం సద్వినియోగం చేసుకున్న జిల్లాలలో తిరుపతికి పదో స్థానం దక్కింది. ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ పథకం వర్తించని బస్సులు ఇక్కడే అధికం.

ఎస్వీఎంసీలో పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్ల ప్రారంభం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాలలో (ఎస్వీఎంసీ) రెండేళ్ల కాలవ్యవధి పారామెడికల్(అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ రవి ప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అర్హులని తెలిపారు. కోర్సులకు సంబంధించిన దరఖాస్తులు, ఇతర వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబరు 8వ తేది సాయంత్రం 5 గంటల్లోపు రూ.100తో కలిపి కళాశాలలోని పారామెడికల్ విభాగంలో అందించాలన్నారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించి తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 94408 79943 నెంబరులో సంప్రదించాలన్నారు.

చిట్టేడు పొలిమేరల్లో పురాతన చారిత్రక ఆనవాళ్లు





రైతులు పొలంలో దుక్కిదున్నడంతో బయటపడిన ఆనాటి రుబ్బురోలు పత్రం - పురాతన కుండల పెంకులు

కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు గ్రామ పొలిమేరల్లో రెండవసారి మంగళవారం కొన్ని పురాతన చారిత్రక ఆనవాళ్లు బయటపడ్డాయి. గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ గోవిందు సురేంద్ర ఆధ్వర్యంలో ఒక బృందం ఈ చారిత్రక ఆనవాళ్లను పరిశీలించారు. గత రెండు రోజులుగా చిట్టేడు గ్రామదేవత చిట్టేటమ్మ దేవాలయ సమీపంలోని పొలాల్లో రైతులు వరి ఎల్లి దుక్కిలు దున్నుతుండగా 15వ శతాబ్దంలోని చిట్టేడు గ్రామ పాలేదారులకు సంబంధించిన అనేక ఆధారాలు బయటపడ్డాయి. అప్పట్లో ఈ ప్రాంత ప్రజలు వాడిన మట్టిపాత్రలు, రాతి పనిముట్లు, రుబ్బురోలు, మట్టికుండల పెంకులు బయటపడినట్లు గోవిందు సురేష్ తెలిపారు. అలాగే అనాటి పాలేగార్ల ఆరాధ్య దైవం పురాతన వినాయకుడి రాతి విగ్రహం కూడా బయటపడింది. మత సంబంధమైన ఆచారాలను తెలిపే కొన్ని వస్తువులు కూడా బయటపడినట్లు గోవిందు సురేష్ తెలిపారు. రెండవసారి అధ్యయనంలో మరిన్ని వివరాలు, ఆనవాళ్లు దొరికితే పురావస్తుశాస్త్ర శాఖకు అప్పగిస్తామన్నారు.



చిట్టేడు పొలిమేరలో 17వ శతాబ్దంనాటి వినాయకుడు విగ్రహం

'కిరితారా' ఏర్పాటుకు సహకారం అందిస్తాం

- ఆ సంస్థ ఎండీ, ప్రతినిధులతో కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐఐటీ వద్ద రూ.80కోట్లతో ఏర్పాటు కానున్న కిరితారా రిసార్ట్ ప్రాజెక్టుకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మెస్సర్స్ కిరితారా రిసార్ట్ సీఈవో, ఎండీ వి.సత్యనారాయణ, టూరిజం ఆర్‌డీ రమణప్రసాద్ మంగళవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు 500మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాటు కానున్న కిరితారా రిసార్ట్‌కు అన్ని విధాల సహకరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. 'ఆసియాలోనే అతిపెద్దదైన స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేయనుంది. లగ్జరీ సూట్స్, విల్లాలు, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఉండేలా రిసార్ట్‌ను రూపొందించారు' అని పర్యాటకశాఖ ఆర్‌డీ రమణప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్లు సుబ్బరాయుడు, శ్రీనివాసులరెడ్డి, ఆర్కిటెక్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శేషాచలం.. జీవవైవిధ్యం

- ఐఐటీతో కలిసి పరిశోధనలకు చర్యలు చేపడుతున్నాం
- డిజిటల్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తామన్న డీఎఫ్‌వో వివేక్

మంగళం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'శేషాచల కొండలు అరుదైన జంతు, వృక్ష, కీటకాలకు నిలయం. ఇక్కడి పక్షులు, సీతాకోకచిలుకలపై ఐఐటీతో కలిసి పరిశోధనలు చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నాం. మరో వైపు ఇక్కడి జంతువులు, పక్షులు, కీటకాల ఫొటోలు, వాటి వివరాలను డిజిటలైజ్ చేసి భద్రపరుస్తాం' అని తిరుపతి డీఎఫ్‌వో వివేక్ తెలిపారు. తిరుపతి నగరం కపిలతీర్థం వద్దనున్న తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా దేవాంగ పిల్లి అంతరించిపోయే దశకు చేరుకుందన్నారు. దీని పరిరక్షణకు, సంతతి పెంపుదలకు ప్రభుత్వం, అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దేవాంగ పిల్లికి సంబంధించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. శేషాచల అభయారణ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీని అభివృద్ధికి వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'తిరుమలలో నీటి వనరులు, ఆహారం సమృద్ధిగా లభించడం, దట్టమైన అడవులు ఉండటంతో ఏనుగులు గుంపులుగా తిరుగుతూ తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. రానున్న ఆరేళ్లలో ఏనుగల సంతతి భారీగా పెరగనుంది. అడవి జంతువులకు, మనుషులకు మధ్య ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టడంపై దృష్టి సారిస్తున్నాం' అని డీఎఫ్‌వో వివరించారు.

అందుకే చిరుతలు వచ్చేది

'ఎస్వీ యూనివర్సిటీ ప్రాంతంలో లభించే ఆహార వ్యర్థాల కోసం శునకాలు వస్తున్నాయి. వాటి కోసం చిరుతలు అటవీప్రాంతం నుంచి ఇటు వస్తున్నాయి. ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో, జూపార్కు రోడ్డులో ప్రజలు ఆహార వ్యర్థాలు వేయకుండా.. వేసినా వెంటనే తొలగించేలా కార్పొరేషన్, టీటీడీ అధికారులతో సంప్రదించాం. ఇలా ఆహార వ్యర్థాలు లేకుండా చేస్తే శునకాలు.. చిరుతలూ రావడం ఆగిపోతాయి. ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో తిరిగే శునకాలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలించాలని నగరపాలక అధికారులకు లేఖ రాశాం. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి జూపార్కు రోడ్డులో ఫుడ్ కోర్టులు, వర్సిటీలో హాస్టల్ పరిసరాలను తనిఖీ చేశారు' అని డీఎఫ్‌వో వివేక్ తెలిపారు. ఆ సమయంలోనే కొందరు యూట్యూబర్లు అవగాహన లోపంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పోస్టులు పెట్టారన్నారు.ఇలా పోస్టులు పెడుతున్న వారిని పిలిపించి అవగాహన కల్పిస్తామన్నారు.

ఆ అటవీ భూముల్లో మొక్కలు నాటుతాం

'శ్రీకాళహస్తి మండలం సింహాచల కండ్రిగ వద్ద అటవీ భూముల ఆక్రమణపై హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. ఇక్కడ ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దు చేసింది. దీంతో ఆ అటవీ భూముల్లో మొక్కలు నాటి పెంచనున్నాం. దీనిని ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 144 సెక్షన్ పెట్టి మొక్కలు నాటిస్తాం. ఆక్రమణలను సహించం' అని డీఎఫ్‌వో తెలిపారు.



దేవాంగపిల్లికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌వో వివేక్

419 దేవాంగ పిల్లులు

శేషాచల కొండల్లోని శ్రీ వేంకటేశ్వర అభయారణ్యంలో స్లెండర్ లోరీస్ (దేవాంగ పిల్లులు)పై అటవీశాఖ సమగ్ర గణన పూర్తి చేసింది. ఈ సర్వే ప్రకారం 419 దేవాంగ పిల్లులు ఉన్నట్లు అంచనా వేశారు రాత్రి పూట జీవించే ఈ చరజీవి ముఖ్యమైన నివాస ప్రాంతాలను గుర్తించారు. ఈ సర్వే పూర్తి వివరాలను ప్రజలకు అందించేందుకు సిద్ధం చేసిన స్లెండర్ లోరీస్ హ్యాండ్ బుక్‌ను మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సర్వే ద్వారా దేవాంగ పిల్లి నివాస ప్రాంతాలు, సంరక్షణ, ప్రజలలో అవగాహన పెంపు వంటి కార్యక్రమాలతో ఈ అరుదైన జాతి సంరక్షణకు అటవీశాఖ కృషి చేస్తోంది.

రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ నేడు ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

శ్రీకాళహస్తి/రేణిగుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్, రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ బుధవారం ప్రారంభం కానున్నాయి. అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో వీటిని ప్రారంభిస్తారని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా పరిశ్రమల యాజమన్యాలు పాల్గొననున్నట్లు తెలిపారు.



రమ్యశ్రీ,ఆమని - ప్రియదర్శి

తిరుమలలో సినీ నటుల సందడి

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు సినీ నటులు దర్శించుకున్నారు. వీరిలో ఆమని, రమ్యశ్రీ, ప్రియదర్శి ఉన్నారు. ఇంకా తెలంగాణ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజున కుటుంబం అంతా కలిసి స్వామిని దర్శించుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా దర్శించుకున్నవారిలో ఉన్నారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో నీటి నిల్వలపై అదనపు ఈవో సమీక్ష



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నీటి నిల్వలపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లోని డ్యాముల్లో నీటి లభ్యత, వినియోగంపై చర్చించారు. తిరుమలలోని గోగర్భం, కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగ, తిరుపతిలోని కల్యాణి డ్యాముల్లో ప్రస్తుతం భక్తుల అవసరాలకు నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు నివేదించారు. భవిష్యత్తులో నీటి నిల్వల సామర్థ్యం పెంచుకోవడానికి అవకాశాలను పరిశీలించాలని అదనపు ఈవో సూచించారు. ఈ సమీక్షలో వాటర్‌వర్క్స్ ఈఈ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో తొమ్మిది షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.88 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,502
తలనీలాలు సమర్పించినవారు: 31,890

మఠం భవనాల కూల్చివేతకు తొందరపడం

● ప్రత్యక్షంగా పరిశీలించాకే నిర్ణయమన్న కలెక్టర్ ● ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం



తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం నడిబొడ్డున గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం పరిపాలనా భవనం కూల్చివేత నిర్ణయం తాత్కాలికంగా వాయిదా పడింది. రెండంతస్తుల ఈ పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదకర స్థితిలో ఉన్న పై అంతస్తునూ, అదే స్థితిలో ఉండే కింది అంతస్తులోని షాపింగ్ గదులనూ కూల్చివేయచ్చంటూ దేవదాయ శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ చేయడంతో స్థానికంగా నిరసనలు మొదలయ్యాయి. తమ బతుకుతెరువుతో ముడిపడిన అంశమని షాపుల వాళ్లు అభ్యంతరం తెలిపారు. దీనిపై మంగళవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఇతర ప్రజాప్రతినిధులు, మఠం, మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశమయ్యారు. పలువురి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

కూల్చకుండా ప్రయత్నిస్తాం: ఎమ్మెల్యే ఆరణి

భవనాన్ని పాక్షికంగా కూల్చాలని మాత్రమే ఆదేశాలు వచ్చాయని, 62 షాపుల్లో కేవలం 12 మాత్రమే కూలుస్తారని, అవి కూడా కొట్టకుండా పునరుద్ధరించే అవకాశముందేమో చూస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ భవనం స్థితిగతులను పరిశీలించేందుకు ఐఐటీ నిపుణులకు కలెక్టర్ లేఖ రాయాలని కోరారు. అలాగే హథీరాంజీ మఠం తిరుపతికి గుండె లాంటిదంటూ, ఆధునిక టెక్నాలజీని వాడుకుని భవనాన్ని పరిరక్షించుకునే దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ సూచించారు. భవనాన్ని ఎలా నిలబెట్టాలో ఆలోచించాలని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ కోరారు. ఇదే వయసున్న భవనాల విషయంలో టీటీడీ ఏం చేస్తోందో పరిశీలించాలని సూచించారు. 'తిరుపతిలో ఇంట్లో చావైనా, పెళ్లైనా ముందుగా వెళ్ళేది మఠం భవనంలో నడుస్తున్న పువ్వుల దుకాణాలకే. వాటిని కూల్చవద్దు. అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. రిట్రోఫిట్టింగ్ విధానంలో మఠం భవనాన్ని కూల్చకుండా పటిష్ఠం చేసే వీలుంది.' అని టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి అన్నారు. తిరుపతికి ల్యాండ్ మార్క్ ఈ భవనాన్ని కూల్చకుండా కాపాడాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. ఒకవేళ మఠం భవనాన్ని కూల్చేసి తిరిగి కడితే ఇపుడున్న వ్యాపారులకే మళ్ళీ షాపులు కేటాయిస్తారా? అని నగర బీజేపీ అధ్యక్షుడు వరప్రసాద్ ప్రశ్నించారు. కూల్చకుండానే పునరుద్ధరించి ఇపుడున్న వ్యాపారులకే ఆ షాపులు ఇస్తామంటే తక్షణం షాపులు ఖాళీ చేస్తామని కార్పొరేటర్ నరసింహాచారి చెప్పారు.

భవనం కూలితే బాధ్యత ఎవరిది?

● ప్రశ్నించిన కలెక్టర్

అందరి అభిప్రాయాలూ తెలుసుకున్న తర్వాత కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ, వందేళ్లకు పైబడిన పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుందని, అది కూలిపోయి ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని సూటిగా ప్రశ్నించారు. వ్యాపారుల జీవనోపాధి దెబ్బతీయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. తమ మొదటి ప్రాధాన్యత మనుషుల ప్రాణాలు కాపాడ్డమేనని స్పష్టం చేశారు. దేవదాయ శాఖ అభ్యర్థనపై తిరుపతి ఐఐటీ నిపుణులు భవనాన్ని పరిశీలించారని, అనేక భాగాలు ప్రమాదకర స్థితిలో వున్నాయని నివేదిక ఇచ్చారన్నారు. దాని ఆధారంగానే దేవాదాయ శాఖ కమిషనర్ భవనం కూల్చివేతకు టెండర్లు పిలిచారన్నారు. అయితే షాపుల్లో అద్దెకు వుంటున్న వ్యాపారులు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు రావడంతో తాత్కాలికంగా టెండర్ల అమలును నిలిపుతామని ప్రకటించారు. ఎమ్మెల్యే, కమిషనర్ సహా ప్రజాప్రతినిధులు, నేతలు, మఠం అధికారులు అందరితో కలసి వారం రోజుల్లో మఠం భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తామన్నారు. దానికి తిరుపతి ఐఐటీ, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులను కూడా ఆహ్వానిస్తామన్నారు. ప్రత్యక్షంగా చూసిన తర్వాతే భవనం కూల్చివేతపై నిర్ణయం తీసుకుంటామన్నారు. భవనాన్ని కూల్చకుండా పటిష్ఠం చేసి పరిరక్షించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సంస్థకూ, పురావస్తు శాఖకు, ఐఐటీకి తానే లేఖలు రాస్తానన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో షాపులు తాత్కాలికంగా ఖాళీ చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అది కూడా తాము భవనాన్ని నేరుగా పరిశీలించాకే అవసరమైతేనే ఖాళీ చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మౌర్య, హథీరాంజీ మఠం ఇంఛార్జి ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, బంజారా సంఘాల ప్రతినిధులు, షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన కింద ఇరుక్కున్న ట్యాంకర్

● గంటన్నరకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం



రేణిగుంట ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని రైల్వే వంతెన కింద గ్యాస్ ట్యాంకర్ ఇరుక్కుంది. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలకు గ్యాస్ తీసుకెళ్లే ట్యాంకరుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని భావించారు. శ్రీకాళహస్తి వైపు నుంచి ఖాళీ గ్యాస్ ట్యాంకరుతో తిరుపతి అర్బన్ మంగళంలోని ఆర్టీవో కార్యాలయానికి బయలదేరారు. దారి తెలియక పాత చెక్‌పోస్టు మీదుగా రైల్వే వంతెన కింద ట్యాంకరును వెళ్లనిచ్చారు. ఈ క్రమంలో భారీ పరిమాణం కలిగిన ట్యాంకరు ఆ దారిలో ఇరుక్కుపోయింది. దాదాపు ఒకటిన్నర గంటసేపు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ట్రాఫిక్‌లో ఓ అంబులెన్సు చిక్కుకు పోయింది. ఈ విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అబార్షన్ కిట్లు, డ్రగ్స్ స్వాధీనం

వరదయ్యపాళెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలోని ఓ మందుల దుకాణంలో చట్టవిరుద్ధంగా విక్రయి స్తున్న అబార్షన్ కిట్లను, డ్రగ్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్వాధీనం చేసుకున్నారు.మండలకేంద్రంలోని మందుల దుకాణాల్లో మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (శ్రీకాళహస్తి) ప్రశాంతి ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ఓ మందుల దుకాణంలో ఎలాంటి అనుమతులుల లేకుండా చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న 140 అబార్షన్ కిట్లను స్వాధీనం చేసుకున్నారు. రోగులకు మత్తు ఇవ్వడానికి వినియోగించే డ్రగ్స్‌ను అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

తిరుమల ఏటీఎంలో కర్ణాటక వాసి హంగామా



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో సోమవారం రాత్రి ఒక వ్యక్తి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి నానా హంగామా సృష్టించాడు. రాత్రి 11.30 గంటల సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ ముందున్న ఏటీఎంలోకి ప్రవేశించిన అతడు పలుచోట్ల వైర్లను కట్ చేశాడు. అనంతరం ఏటీఎం మిషన్ చుట్టూ అనుమానాస్పదంగా తిరిగాడు. ఈ దృశ్యాలన్నీ మరో సీసీ కెమెరాలో రికార్డు కావడంతో బ్యాంక్ అధికారులు తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మంగళవారం ఉదయం కల్యాణకట్ట వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. కర్ణాటకకు చెందిన ప్రవీణ్‌కుమార్‌గా గుర్తించామని, మానసిక స్థితి సరిగాలేదని సీఐ శ్రీరాముడు తెలిపారు. అయినప్పటికీ గతంలో ఏవైనా నేరాలకు పాల్పడ్డాడా అనే కోణంలోనూ విచారిస్తున్నామన్నారు.

అటువంటి ఆలయం ఇక్కడొద్దు

● కొండూరులో గుడి నిర్మాణంపై గ్రామస్తుల అభ్యంతరం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు శరత్‌బాబు

తడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలోని కొండూరులో వివాదాస్పదంగా మారిన దేవాలయ నిర్మాణం విషయమై మంగళవారం తహసీల్దారు శరత్‌బాబు గ్రామసభ నిర్వహించారు. గుంట పొరంబోకు భూమిలో చాముండేశ్వరిదేవి ఆలయం పేరుతో నిర్మాణాలు మొదలుపెట్టి, అందులో చేతబడులు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై కొండూరులో గ్రామసభ నిర్వహించి స్థానికుల అభిప్రాయాలు తీసుకుని నివేదిక పంపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. దీంతో తహసీల్దారు గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో పాటు పంచాయతీ వార్డు సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు వంతులకుపైగా గ్రామస్తులు అటువంటి దేవాలయం ఇక్కడ వద్దని, వెంటనే దానిని తొలగించాలంటూ తహసీల్దారుకు విన్నవించారు. తమకు సమాచారం ఇవ్వకుండా, అజెండాలో పేర్కొనకుండా దేవాలయ నిర్మాణానికి పంచాయతీ అనుమతి ఇవ్వడంపై పలువురు వార్డు సభ్యులు అభ్యంతరం తెలిపారు. వెంటనే వార్డుసభ్యుల సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను నమోదు చేసి నివేదిక సమర్పించాలని పంచాయతీ అధికారులను తహసీల్దారు ఆదేశించారు. ఈ నివేదికలన్నింటిని ఉన్నతాధికారులకు పంపి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్‌బాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ, సూళ్లూరుపేట ఎస్‌ఐలు కొండపనాయుడు, బ్రహ్మనాయుడు, సర్పంచ్ లక్ష్మమ్మ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.పది లక్షల విరాళం



తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు మంగళవారం రూ.పది లక్షల విరాళం అందింది. బెంగళూరుకు చెందిన వినుత గణేష్ ఈ విరాళ చెక్కును తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో ముందస్తు తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం బుధవారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తారన్న సమాచారం తెలియడంతో మంగళవారం స్టేషన్‌లో అధికారులు ముందస్తు తనిఖీలు చేశారు. బాధ్యతలు చేపట్టిన జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ స్టేషన్‌లో ఏ ప్రాంతంలో పర్యటిస్తారో తెలియక అన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నపరెడ్డిలతో పాటు కమర్షియల్, ఇంజనీరింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





అవార్డు అందుకుంటున్న లావణ్య కుమార్, సాయికుమార్

అవార్డులందుకున్న 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లు

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లో విజేతలుగా నిలిచిన తిరుపతి 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు ఆర్.లావణ్య కుమార్, కె.సాయికుమార్ అవార్డులు స్వీకరించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

ల్యాప్ ట్యాప్‌ల చోరీ ఆ ఆగంతకుడి పనేనా?

● దర్యాప్తు చేస్తున్న పోలీసులు
● ఐఐటీలో భద్రతా వైఫల్యంపై విమర్శలు

ఏర్పేడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో ల్యాప్‌టాప్‌ల చోరీ కలకలం రేపింది. శనివారం హాస్టల్ భవనాల్లో విద్యార్థులకు చెందిన 8ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయిన సంగతి తెలిసిందే. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో జరిగిన ఈ చోరీ ఘటనపై విచారణకు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఐఐటీని సందర్శించారు. హాస్టల్ భవనాలను తనిఖీ చేశారు. బాధిత విద్యార్థులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజీతోపాలు పలు సాంకేతిక అంశాల ద్వారా నిందితుడ్ని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎవరా దుండగుడు?

శనివారం ఓ ప్రొఫెసర్ పేరుచెప్పి ఓ వ్యక్తి ఐఐటీలోకి వచ్చినట్లు తెలుస్తోంది. తమ పిల్లల యోగక్షేమాలు తెలుసుకోవడానికివెళుతున్నానని అతడు చెప్పినట్లు సమాచారం. ఈక్రమంలో హాస్టల్ గదుల్లో ఎనిమిది మంది విద్యార్థుల ల్యాప్‌టాప్‌లను చోరీ చేసి తన వాహనంలో పెట్టుకుని ప్రధాన మార్గంలోనే వెళ్లిపోయాడని భావిస్తున్నారు. ఈ విషయంలో భద్రతా సిబ్బంది తీరు విమర్శలకు దారితీస్తోంది. ఆగంతకుడు సులభంగా లోపలికి రావడం, వెళ్తున్నప్పుడు తనిఖీ చేయకపోవడం చోరీకి ప్రధాన కారణమంటున్నారు. దుండగుడు లోపలికి ప్రవేశించడం వెనుక ఐఐటీకి చెందిన ఓ అధికారి హస్తమున్నట్లు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు



పురుషుల హాకీ విజేత



మహిళల హాకీ విజేత

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శాప్ నిర్వహించిన అమరావతి చాంపియన్‌షిప్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. రాయలసీమ పరిధిలోని ఎనిమిది జిల్లాల నుంచి 2,362మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, షటిల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ క్రీడాంశాలలో తలపడ్డారు. రెండు రోజులుగా ఎస్వీ స్టేడియం, శ్రీనివాస క్రీడాసముదాయం, ఎస్వీ ఆర్ట్స్ మైదానం, ఎస్వీయూ స్పోర్ట్స్ ఎరీనాలు బాలబాలికలతో కళకళలాడాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. విజేతజట్లకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పురుష విభాగంలో ఆర్చరీలో ఇద్దరు, అథ్లెటిక్స్‌లో ఒకరు, షటిల్ బాడ్మింటన్ ఒకరు, బాక్సింగ్‌లో 10మంది, హాకీ జట్టు, వాలీబాల్ జట్టు, మహిళా విభాగంలో ఆర్చరీలో ఒకరు, అథ్లెటిక్స్‌లో ఇద్దరు, షటిల్‌బ్యాడ్మింటన్ ఇద్దరు, బాక్సింగ్‌లో ఏడుగురు, హాకీ జట్టు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.

డీఫార్మసీ దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): డీఫార్మసీ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించేందుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకానాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీ లేదా ఎంపీసీ ఉత్తీర్ణులైనవారు రెండేళ్ల కాలవ్యవధి కలిగిన ఫార్మసీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులు. ఇంటర్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఈనెల 30న మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారు. తెల్లరేషన్ కార్డు లేదా ప్రభుత్వ నిబంధనల మేరకు ఇన్‌కం సర్టిఫికెట్ ఉన్నవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. మరిన్ని వివరాలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని లేదా కళాశాలలో ఫార్మసీ విభాగంలో లేదా 99088 57585, 99667 61446, 99635 41557 నంబర్లలో సంప్రదించవచ్చు. apsbtet.in/pharmacy లింక్‌ను ఉపయోగించి ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించవచ్చు.

వైసీపీ జెండాలతో తిరుమలకు పాదయాత్ర

● అడ్డుకుని 10మందికి పోలీసుల అనుమతి




శ్రీవారిమెట్టు మార్గంలో ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు - వైసీపీ జెండాలతో వాహనం

చంద్రగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో నిందితుడు ఎంపీ మిథున్‌రెడ్డి ఆరోగ్యం బాగుండాలని తిరుమలకు పాదయాత్రగా వస్తున్న వైసీపీ కార్యకర్తలనుచంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శనివారం వైసీపీ విద్యార్థి సంఘం నాయకుడు హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది పీలేరు నుంచి పార్టీ జెండాలతో తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు శ్రీనివాసమంగాపురానికి చేరుకున్నారు. పార్టీ జెండాలతో శ్రీవారిమెట్టు మార్గంలో వెళ్ళకూడదని డీఎస్పీ ప్రసాద్, సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపారు. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీవారి మెట్టు మార్గంలో ధర్నా చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని 10 మందిని అనుమతిస్తామని చెప్పడంతో వారు అంగీకరించారు. అయితే 10 మంది కాకుండా పోలీసుల కళ్లు గప్పి మరో ఆరుగురు వెళ్లారు. దీంతో టీటీడీ సెక్యూరిటీ, పోలీసులు అప్రమత్తమై ఆ ఆరుగురిని అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టండి

● విద్యార్థులకు డీఈవో పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని డీఈవో కేవీఎన్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్వీ హైస్కూల్లో మంగళవారం జరిగిన ఇన్‌స్పైర్ అవార్డ్స్-2025 నామినేషన్ల ఒకరోజు శిక్షణా తరగతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్లలో మన జిల్లా ముందుండాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) గౌరీ శంకర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లు వేయాలన్నారు. ప్రదర్శనాంశాలు వినూత్నంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ శివ శంకరయ్య, ఏఎస్ఓ సారథి, ఎస్వీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సంధ్య, డీవైఈవో ఇందిరాదేవి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, రిసోర్స్ పర్సన్లు నీలకంఠ, మేఘనాథ్, హరిశంకర్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

- ఆ భూమి విషయంలో ఏ చర్యలు తీసుకున్నా

చట్టనిబంధనల ప్రకారం నడుచుకోండి

● భూమన కుటుంబ సభ్యుల భూఆక్రమణ విషయంలో రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశం
● తహసీల్దారు ఇచ్చిన నోటీసు రద్దు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ పరిధిలో వైసీపీనేత భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు 9.33 ఎకరాల నదీ పోరంబోకు ఆక్రమణ వ్యవహారంలో ఏ చర్యలు తీసుకున్నా చట్టనిబంధనల ప్రకారం నడుచుకోవాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. తహసీల్దారు ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదని పేర్కొంటూ దానిని రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ పరిధిలోని సర్వేనెం. 479లోని 9.33 ఎకరాల నదీ పోరంబోకు భూమిని ఆక్రమించారని, అందులోని నిర్మాణాలను తొలగించాలని తిరుపతి గ్రామీణ మండలం తహశీల్దార్ ఈనెల 11న ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ భూమన కరుణాకర్‌రెడ్డి భార్య జంగా రేవతి, కుమారుడు అభినయ్ హైకోర్టును ఆశ్రయించారు. వీరి తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ఆ భూమిని 2001-02లో కొనుగోలు చేశారన్నారు. తహశీల్దార్ ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదన్నారు. సంబంధిత భూమి నదీ పోరంబోకు అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలను నోటీసుకు జత చేయలేదన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు భూమిని ఆక్రమించారనేందుకు ఆధారాలు ఉన్నాయన్నారు. నిబంధనలకు అనుగుణంగానే నోటీసులు జారీ చేశామన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కురుగొండ్ల



లబ్ధిదారులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో రీ సర్వే చేసిన గ్రామాల రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ప్రజల భూములను కాజేలా తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేయడం జరిగిందన్నారు. మండల పరిధిలోని 54 గ్రామాలకు సంబంధించి 7086 పాస్ పుస్తకాలు సిద్ధం కాగా, అందులో 300 పైచిలుకు పాస్ పుస్తకాలను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా, తహసీల్దారు నరసింహారావు, సీఐ రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, మంకు ఆనంద్, గొల్లగుంట వెంకటముని, జీకేపల్లి బాబు, తోటా రామచంద్రయ్య, మగ్గం వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట ఏఎంసీ పాలకవర్గ నియామకం

తడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక వర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ చెర్మన్‌గా సూళ్లూరుపేట టీడీపీ పట్టణాధ్యక్షుడు ఆకుతోట రమేష్‌ను ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి పాలక వర్గాన్ని కూడా నియమించారు. ఎమ్మెల్యే విజయశ్రీ గౌరవ చెర్మన్‌గా, ఓడూరు రవీంద్రరెడ్డిని వైస్‌చెర్మన్‌గా నియమించింది. అలాగే బోడిలింగాలపాడు గుణసుందరి, షేక్ షబ్బీర్, తొప్పాని బాబు, వంకా మునిరత్నం, ఎర్రా హేమ భూషణం, వేలూరు చంద్రశేఖర్, యాకసిరి యామిని, బొట్టు నాగేశ్వరావు, బందిల కస్తూరమ్మ, వేమసాని సుజాత, బొమ్మన ఏకాంబరం, ఆలపాటి బాలాజి, ఆవుల సుబ్బరాజుతో పాటు తడ పీఏసీఎస్ అధ్యక్షుడు, వ్యవసాయ శాఖ ఏడీ, తడ మండలం కొండూరు సర్పంచ్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులను సభ్యులుగా నియమిస్తూ జీవో జారీ చేసింది. ఈ పాలకవర్గం ఏడాది పాటు కొనసాగనుంది.

పోలేరమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.2617483 వచ్చింది. మంగళవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.2617483 నగదుతో పాటు 38 గ్రాముల బంగారు, 128 గ్రాముల వెండి లభించింది. ఫిబ్రవరి 2 నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో స్తంభాలగిరి ఈశ్వరయ్య ఆలయ పి.శ్రీనివాసులు, యూనియన్ బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించండి

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపోలూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆబాక, సామంతమల్లాం, బొందపాలెం తదితర గ్రామాల్లో చిన్నపాటి వర్షం, తేలికపాటి గాలివీచిన రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, సమస్య పరిష్కరించాలని ఆ గ్రామస్థులు ఏడీఈ శేఖర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏడీఈని టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, జనార్దన్, ఏలి సతీష్ కలిశారు. మూడు రోజుల నుంచి రాత్రి సమయాల్లో పూర్తిగా కరెంట్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎనర్జీ అసిస్టెంట్, లైన్‌మెన్‌కు ఫోన్ చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఏడీఈ స్పందించి లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌తో మాట్లాడారు. సమస్యను గుర్తించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.

పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

వాకాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వాకాడు పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ గీతాకుమారి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ఠాపనకు నిర్వాహకులు పోలీసుశాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు ఉత్సవాలను జరుపుకోవాలని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్



శ్రీసిటీ ప్రతినిధులతో కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్

సత్యవేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ చాంగ్‌న్యూన్ కిమ్ తమ అధికారుల బృందంతో కలిసి మంగళవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్, శ్రీసిటీ బిజినెస్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడ్గన్ జార్జ్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా శ్రీసిటీలోని పారిశ్రామిక అభివృద్ధి గురించి వివరించారు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్‌తో సహా పలు కొరియన్ సంస్థలు ఇక్కడ సంస్థలు నెలకొల్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను కొనియాడుతూ రాష్ట్రంలోని రవాణా వసతులు, నైపుణ్యత, వివిధ వ్యాపార ప్రయోజనాలకు శ్రీసిటీ అద్దం పడుతోందన్నారు. కొరియన్ జనరల్ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు శ్రీసిటీలో ఉన్నాయని వివరించారు. కొరియా దేశానికి చెందిన ఎల్జీ, సోలెం, హెచ్‌డీసీ, ఎస్‌కే ప్యుకోర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రఖ్యాత సంస్థలు శ్రీసిటీలో విజయవంతంగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు.

నీటి పన్ను చెల్లించండి

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఉన్న వారందరూ నీటి పన్ను చెల్లించాలని, లేకుంటే కనెన్షన్‌ను తొలగిస్తామని కమిషనర్ చిన్నయ్య చెప్పారు. ప్రజలు నీటి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఈ రోడ్లోనే ఆర్డీవో వెళ్లేది!

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు చినుకు పడితే చాలు రొచ్చురొచ్చుగా మారుతోంది. కార్యాలయానికి వెళ్లాలంటే బురద తొక్కాల్సిందే అన్నట్లుంది పరిస్థితి. గాండ్ల వీధిలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రోడ్డు గుంతలు ఏర్పడి వర్షపు నీళ్లు నిలబడి అధ్వానంగా ఉంది. కార్యాలయ సమీపంలో రోడ్డుకు పక్కనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రోడ్లోనే ఆర్డీవోతో పాటు సిబ్బంది రోజూ కార్యాలయానికి వెళ్లి వస్తున్నారా అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.



అధ్వానంగా ఉన్న ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

పెళ్లకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను నిబంధనలు పాటిస్తూ నిర్వహించుకోవాలని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు కోరారు. మంగళవారం పెళ్లకూరు పోలీసు స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందిర్లు, మండపాల ఏర్పాటుకు పోలీసు స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీల వివరాలను పోలీసు స్టేషన్‌లో అందజేయాలన్నారు. ఊరేగింపు సమయంలో లౌడ్ స్పీకర్లు, బాణసంచా పేలుళ్లు, డీజేలు, పాటకచ్చేరీలకు అనుమతులు లేవన్నారు. గ్రామాల్లో వివాదాలకు తావులేకుండా అందరూ ఐక్యంగా ఉండి వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. వివాదాలకు దిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉత్సవ కమిటీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, రైటర్ తిరుపతయ్య, నాయకులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, కేవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ సంగమేశ్వరరావు

నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ఆదినారాయణ రెడ్డి



ఎమ్మెల్యే విజయశ్రీ నుంచి ఉత్తర్వుల ప్రతి అందుకుంటున్న ఆదినారాయణ రెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి ఆలయానికి కమిటీ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి అధ్యక్షుడిగా బీజేపీ నాయకుడు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డిని నియమించారు. అలాగే పట్టుపల్లి మోహన్, పోలూరు లీలామోహన్, చిట్టేటి మధు, మాటిరెడ్డి బేబీ, వెంకటనాగ ప్రమీల, మామండూరు శాంతి, పొల్లమాల సుమతి, ఆనంద నాయుడులను సభ్యులుగా నియమించారు. బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆలయ పాలకమండలి నియామక ఉత్తర్వులను చైర్మన్‌గా నియమితులైన ఆదినారాయణ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, మాధవ నాయుడు, బీజేపీ నాయకులు తన్నీరు శేషగిరిరావు, చెన్నకేశవరావు, ఆరణి విజయభాస్కర్ రెడ్డి, నూతలపాటి శ్రీనివాసులు, కృష్ణ తదితరులు ఉన్నారు. కాగా, నూతన పాలక మండలి ఈ నెల 25న ప్రమాణ స్వీకారం చేయనుంది.

నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కృషి

గూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద నాయీ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. దేవాలయ కమిటీల్లో నాయీ బ్రాహ్మణులను సభ్యులుగా నియమించేందుకు, వాయిద్య కళాకారులకు రూ.15వేల నుంచి రూ.25 వేల వరకు జీవనభృతి అందించేలా చర్యలు తీసుకొందన్నారు. కార్యక్రమంలో బాలగురుస్వామి, గురుమూర్తి, గోపాల్, ధనుంజయ్, వెంకటేశ్వర్లు, రాజా, ప్రతాప్, ప్రసాద్, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కారును ఢీకొన్న లారీ




ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో కారును లారీ ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఒడిశా నుంచి కర్ణాటకకు వెళ్తున్న లారీ అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో కారును ఢీకొనడంతో, ఆ కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న మరో కారు, బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యాయి. కారులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలు నడుపుకుని జీవనం సాగించే కార్మికులు వీధి పడ్డారని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో కార్మికుల సంఘ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.శివ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఆటో కార్మికులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధాకర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, నాగేంద్ర బాబు, బాల తదితరులు పాల్గొన్నారు.

పంచలోహాల చీరతో కామాక్షీదేవి



కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలోని సంగమేశ్వర ఆలయంలో ఉన్న కామాక్షీదేవిని మంగళవారం పంచలోహ చీర అలంకరించారు. ఇటీవల అమ్మవారి విగ్రహాన్ని తొలగించి జీర్ణోధరణ అనంతరం ప్రతిష్ఠించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన కుంభాభిషేకాలు నిర్వహించారు. విగ్రహం జీర్ణోధరణ తరువాత అమ్మవారికి పంచలోహాల పూతతో కలిగిన చీర కట్టి అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు.

స్వామిత్వపై అవగాహన ర్యాలీ

కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం పంచాయతీ పరిధిలో గల సిద్ధమ్మకండ్రిగలో మంగళవారం స్వామిత్వ సర్వే జరిగింది. ఎంపీడీవో ఏకొల్లు వేణు, పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో స్వామిత్వపై గ్రామంలో అవగాహన ర్యాలీ జరిగింది.

రేపు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

బాలాయపల్లి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 21 తేదీన తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనునట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు.

డక్కిలి పీహెచ్‌సీలో రేపు వైద్యశిబిరం

డక్కిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డక్కిలి పీహెచ్‌సీలో గురువారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి బిందుప్రియ తెలిపారు.

నేడు సూళ్లూరుపేట మండల సమావేశం

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఏవీ మురళికృష్ణ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు.

నిబంధనల మేరకే చవితి ఉత్సవాలు

తడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను నిబంధనల మేరకే నిర్వహించుకోవాలని ఎస్ఐ కొండపనాయుడు సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగే మార్గాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని ఆదేశించారు. డీజే మ్యూజిక్ సౌండ్, అశ్లీల డ్యాన్సులు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిమజ్జనం రాత్రి 10 గంటలలోపే ముగించాలని సూచించారు.

చవితి ఉత్సవాల్లో డీజేలు నిషేధం

డక్కిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ శివశంకర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉత్సవాల్లో అశ్లీల నృత్య ప్రదర్శలు నిర్వహిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే మట్టి గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక వారాహి విద్యావికాస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ మౌనీష్ మంగళవారం తెలిపారు. ఈనెల 17న ఒంగోలులో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మేఘాసింగ్ ప్రథమ స్థానం, వరుణ్‌సందేశ్ ద్వితీయ స్థానం, శషాంక్‌శ్రీసాయి, తనీష్ మూడో స్థానంలో నిలిచారని తెలిపారు.

ఉపాధి అక్రమాలపై విచారణ

బాలాయపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కామకూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై మంగళవారం విచారణ చేపట్టారు. కామకూరు గ్రామంలో జరిగిన ఉపాధి పనుల మస్టర్లు నమోదులో అవకతవకలను ఉపాధి హామీ కమిషనర్ విజయవాడ కార్యాలయ అధికారులు గుర్తించారు. విచారణ చేపట్టాలని జిల్లా డ్వామా కార్యాలయానికి ఆదేశాలు రావంతో మంగళవారం ఏపీడీ వరప్రసాద్ విచారణ చేపట్టారు.

రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం

వాకాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం కానున్నాయని డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ అన్నారు. మంగళవారం మండలంలోని గంగన్నపాళెంలో గ్రామసభ నిర్వహించారు. రైతుల భూ హక్కులకు సంబంధించి ఇప్పటికే పూర్తి చేసిన వివరాలను వెల్లడించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖీల్‌యాదవ్, మండల సర్వేయర్ శకుంతల, వీఆర్వో పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి



షబ్బీర్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ షబ్బీర్(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... షబ్బీర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 14వ తేదీ ఇంటి నుంచి అలిగి వెళ్లినట్లు తెలిసింది. మంగళవారం భరత్‌నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో షబ్బీర్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బాల్య వివాహాలు జరక్కుండా చూడాలి



తల్లులు, కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మునికుమారి

కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమని, ఈ సాంప్రదాయాన్ని అవగాహనతో తరిమికొడదామని సీడీపీవో మునికుమారి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గూడలి పంచాయతీ కొండమిట్ట గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, తల్లులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల కారణంగా నిరక్షరాస్యత, హింస, వేధింపులు, ప్రసూతి, శిశు మరణాలు, పేదరికం, మానసిక ఆరోగ్యం దెబ్బతీస్తాయన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టడంలో ప్రతి మహిళ కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత, వర్కర్ కోటేశ్వరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకుల నిరసన

గూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తమరెడ్డి, శివ మాట్లాడుతూ మోటారు రంగం కార్మికులకు తీవ్రనష్టం కలిగించే జీవోలు 21, 31 వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద రూ.15వేలు ఆర్థిక సాయాన్ని అందజేయాలన్నారు. వాహనాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్, సీవీఆర్ కుమార్, నారాయణ, బాలు, ప్రమీల, శశికుమార్, రమేష్, సునీల్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరు అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుంద న్నారు. వినాయక చవితి సందర్భంగా చవితి వేడుకల్లో ఎటువంటి గొడవలు జరకుండా ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్, మహాత్మగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వరావు, ఆవుల దాస్, కిరణ్‌కుమార్, శేఖర్, బాబ్జి, దయానంద, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. సీనియర్ ఫొటో గ్రాఫర్ బాబర్‌ను సత్కరించారు. పాత బస్టాండ్ శ్రీరామమందిరం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఖాన్ బాషా, కార్యదర్శి మల్లిఖార్జున్, మల్లిఖార్జున్, సునీల్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

21న అంగన్‌వాడీల నిరసన

వెంకటగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ వెంకటగిరి ప్రాజెక్టు అధ్యక్షురాలు మంజుల కోరారు. మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎఫ్‌ఆర్ఎస్ రద్దు, వేతనాల పెంపు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చే జీవో వెంటనే ఇవ్వాలన్న డిమాండ్ల సాధన కోసం ఈ నెల 21న నిర్వహించే నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాషిణి, నిర్మల, సుమతి, సుహాసిని పాల్గొన్నారు.